

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 211

శనివారం 21-10-2023

SIMULTANEOUSLY PRINTED AT RAJAMAHENDRAVARAM | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి బిజినెస్

శనివారం
21-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
232	82
65,398	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	13,063	▽ 123
డోజోన్స్	33,308	▽ 106
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
షాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	60,250
బంగారం (22 క్యారట్)	57,380
వెండి (కేజీ)	77,550

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	99.44	102.75
€	యూరో	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	54.73	56.44
AUS	ఆస్ట్రేలియా డాలర్	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	59.70	61.63
SAR	సౌదీ రియాల్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	21.73	23.53
¥	చైనా యువాన్	10.24	12.31

తాన్లా లాభం 29% జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తాన్లా ప్లాట్‌ఫామ్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 29 శాతం ఎగసి రూ.143 కోట్లు సాధించింది. ఈపీఎస్ రూ.8.14 నుంచి రూ.10.61లకు చేరింది. ఎబిటా 41 శాతం అధికమై రూ.197 కోట్లను తాకింది. ఎబిటా మార్జిన్ 312 బేసిస్ పాయింట్లు పెరిగింది. టర్నోవర్ 19 శాతం దూసుకెళ్లి రూ.1,009 కోట్లకు చేరింది. తాన్లా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో శుక్రవారం 4.21 శాతం పెరిగి రూ.1,067.50 వద్ద స్థిరపడింది.

లారస్ ల్యాబ్స్ లాభం తగ్గింది

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లారస్ ల్యాబ్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 84 శాతం తగ్గి రూ.37 కోట్లకు చేరింది. ఎబిటా 58 శాతం క్షీణించి రూ.188 కోట్లకు పడిపోయింది. ఎబిటా మార్జిన్ 28.5 నుంచి 15.3 శాతంగా ఉంది.



టర్నోవర్ 22.3 శాతం తగ్గి రూ.1,224 కోట్లు నమోదైంది. ఒక్కో షేరుకు 40 పైసలు మధ్యంతర డివిడెండ్ చెల్లించాలన్న ప్రతిపాదనకు కంపెనీ ఆమోదం తెలిపింది. ఫలితాల నేపథ్యంలో లారస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో శుక్రవారం 0.95 శాతం అధికమై రూ.399.65 వద్ద స్థిరపడింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-2-2023	
విశాఖ	540-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	528-00
విజయవాడ	528-00
రిటైల్ ధర (డజను)	72.00
20-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

హిందుస్తాన్ జింక్ లాభం డౌన్

క్యూ2లో రూ. 1,729 కోట్లు

న్యూఢిల్లీ: వేదాంతా గ్రూప్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 35 శాతంపైగా క్షీణించి రూ. 1,729 కోట్లకు పరిమితమైంది. ఆదాయం నీరసించడం ప్రభావం చూపింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,680 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 8,703 కోట్ల నుంచి రూ. 7,014 కోట్లకు వెనకడుగు వేసింది. ఈ కాలంలో మైన్‌డ్ మెటల్ ఉత్పత్తి 1.4 శాతం క్షీణించి 2,52,000 టన్నులకు పరిమితం కాగా.. రిఫైన్‌డ్ మెటల్ తయారీ సైతం 2 శాతం తగ్గి 2,41,000 టన్నులకు చేరింది. సమీకృత జింక్ ఉత్పత్తి 2.3 శాతం నీరసించి 1,85,000 టన్నులను తాకింది. శుద్ధిచేసిన లెడ్ ఉత్పత్తి ఫ్లాట్‌గా 57,000 టన్నులుగా నమోదైంది. సెరెంటికా రెనెవబుల్స్ ఇండియాలో కంపెనీకిగల 26 శాతం వాటా



తనఖాకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. రూ. 2,648 కోట్ల క్యాష్ ఫ్లో సాధించినట్లు తెలియజేసింది. హింద్ జింక్‌లో వేదాంతాకు 64.9 శాతం, ప్రభుత్వానికి 29.5 శాతం చొప్పున వాటా ఉంది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 2% నీరసించి రూ. 309 వద్ద ముగిసింది.

భవిష్యత్ తరాలపై రుణభారం మోపం..

- ద్రవ్య లోటు కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక స్థిరత్వం కోసం ద్రవ్య లోటును కట్టడి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. భవిష్యత్ తరాలపై రుణాల భారం మోపకుండా చూసేందుకు తగు చర్యలు తీసుకుంటోందని ఆమె వివరించారు. కౌటిల్య ఆర్థిక సదస్సు 2023లో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు తెలిపారు. ప్రభుత్వ రుణభారాన్ని తగ్గించుకునేందుకు తోడ్పడే చర్యలన్నింటినీ పరిశీలిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. 'దేశ స్థూల ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన అంశాలు, అలాగే ద్రవ్య నిర్వహణపరమైన బాధ్యతల గురించి, నేడు తీసుకునే నిర్ణయాల ప్రభావం భవిష్యత్ తరాలపై ఎలా ఉంటుందనే అంశం గురించి ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉంది. తదనుగుణంగానే చర్యలు తీసుకుంటున్నాం'



అని నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇతర దేశాలతో పోలిస్తే ప్రభుత్వ రుణభారం మరీ ఎక్కువగా లేకపోయినప్పటికీ, దాన్ని కూడా తగ్గించుకునే క్రమంలో మిగతా దేశాలు ఎలాంటి ప్రయోగాలు చేస్తున్నాయనేది పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. డిజిటల్ ఎకానమీ ద్వారా దేశీయంగా మరింత పారదర్శకత పెరుగుతోందని మంత్రి చెప్పారు. అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి తేవడంలో జన్ ధన్ ఖాతాలు కీలక సాధనాలుగా మారాయని వివరించారు. 2014లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు బోలెడన్ని సందేహాలు వ్యక్తమయ్యాయని, ఆ ఖాతాల్లో పైసా కూడా ఉండకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులకు నిర్వహణపరంగా భారమవుతాయనే విమర్శలు వచ్చాయని ఆమె చెప్పారు. అయితే, నేడు జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం రూ. 2 లక్షల కోట్ల పైగా బ్యాలెన్స్ ఉందని మంత్రి తెలిపారు. కోవిడ్ పరిస్థితుల్లో నిరుపేదలు ఈ ఖాతాల ద్వారానే ప్రభుత్వం నుంచి నిధులు పొందగలిగారని వివరించారు.

'ఉగ్ర' ముప్పును కూడా పరిగణనలోకి తీసుకున్నాకే పెట్టుబడులు..

పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు అంతర్జాతీయంగా ఉగ్రవాద ముప్పు ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వ్యాపారవర్గాలకు నిర్మలా సీతారామన్ సూచించారు. ఉగ్రవాదం ప్రస్తుతం యావత్ ప్రపంచంపైనా ప్రభావం చూపుతోందని, ఏ ఒక్క ప్రాంతమూ మినహాయింపుగా లేదని ఆమె పేర్కొన్నారు. వ్యాపారపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో భారీ స్థాయి రిస్కులు నెలకొన్నప్పుడు పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని మంత్రి చెప్పారు.

మూడో రోజూ నష్టాలే

- ఎఫ్‌ఎంసీజీ, ఇంధన షేర్లలో భారీ అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 232 పాయింట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా మూడో రోజూ నష్టాలతో ముగిసింది. బలహీన అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం కొనసాగింది. దేశీయంగా ఇటీవల వెలువడిన కీలక కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరిచాయి. క్రూడాయిల్ ధరలు, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం కూడా ఒత్తిడిని పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 232 పాయింట్లు పతనమై 65,398 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయి 19,543 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ట్రెండ్‌కు అనుగుణంగా సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో బలహీనంగా కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 321 పాయింట్లు క్షీణించి 65,309 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు పతనమై 19,519 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ఇంధన, వినిమయ, మెటల్, టెలికం, ఎఫ్‌ఎంసీజీ, కమోడిటీ షేర్లలో భారీగా అమ్మకాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 1.02%, 0.76% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 456 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.9 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 885 పాయింట్లు, నిఫ్టీ 208 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.



- సెప్టెంబర్ క్వార్టర్‌లో మార్జిన్లు క్షీణించడంతో హిందుస్థాన్ యూనిలివర్(హెచ్‌యూఎల్) షేరు 2% నష్టపోయి రూ.2,495 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో రెండున్నరశాతం పతనమైన రూ. 2,485 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు పతనంతో కంపెనీకి రూ.12,418 కోట్ల నష్టం వాటిల్లింది. కంపెనీ మార్కెట్ క్యాపిలైజేషన్ రూ.5.86 లక్షల కోట్లుగా నమోదైంది.
- ఆశించిన స్థాయిలో క్యూ2 ఆర్థిక ఫలితాలు నమోదుకాకపోవడం ఐటీసీ షేరు 3% క్షీణించి రూ.438 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.15,027 కోట్లు తగ్గి రూ.5.47 లక్షల కోట్లుగా నమోదైంది.
- క్యాబ్ అగ్రిగేటర్లు, డెలివరీ సర్వీసు సంస్థలకు విద్యుత్ వాహనాల విధానానికి ఢిల్లీ ప్రభుత్వం అనుమతినివ్వడం ఇంద్రప్రస్థ గ్యాస్ కంపెనీ షేరుపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. ఫలితంగా బీఎస్ఈలో 12% నష్టపోయి రూ.403 వద్ద స్థిరపడింది. పలు రేటింగ్ సంస్థలు ఈ షేరు కొనుగోలు టార్గెట్ ధరను తగ్గాయి.
- చివరి రోజు నాటికి ఐఆర్ఎం ఎనర్జీ ఐపీఓకు 27.05 రెట్ల స్పందన లభించింది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ 76.24 లక్షల ఈక్విటీలను జారీ చేయగా 20.62 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగతేతర విభాగం 48.34 రెట్లు, క్యూఐబీ కోటా 44.73 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల విభాగం 9.29 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రెండు ఎక్స్ఛేంజీలలో అక్టోబర్ 31న షేర్లు లిస్ట్ కానున్నాయి

రూ. 66 వేల కోట్లతో సెమీకాన్ పరిశోధన కేంద్రం

కేంద్రానికి నిపుణుల కమిటీ సిఫార్సు

న్యూఢిల్లీ: దేశీయంగా సెమీకండక్టర్ల విభాగానికి మరింత ఊతమిచ్చే దిశగా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రానికి నిపుణుల కమిటీ సూచించింది. ఇందుకు ప్రాథమికంగా వచ్చే అయిదేళ్లలో 8 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 66,500 కోట్లు) వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి



రాజీవ్ చంద్రశేఖర్‌కు కమిటీ ఈ మేరకు ఓ నివేదికను సమర్పించింది. ప్రతిపాదిత భారత్ సెమీకండక్టర్ రీసెర్చ్ సెంటర్ వచ్చే ఏడాది నుంచి రూపుదిద్దుకోగలదని మంత్రి తెలిపారు.

ఘనంగా ఆర్.ఎస్.బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు



హైదరాబాద్: ఆర్.ఎస్.బ్రదర్స్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు తిరుపతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. నటి అనుపమ పరమేశ్వరన్ జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా యాజమాన్యం రూ.1,000 విలువ చేసే కొనుగోలుపై తక్షణ బహుమతులు, ఎస్‌బీఐ కార్డుపై 5% క్యాష్ బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది.

వన్‌ప్లస్ ఓపెన్ ఫోల్డబుల్ ఫోన్‌పై రిలయన్స్ డిజిటల్ ఆఫర్లు

ముంబై: వన్‌ప్లస్ ఓపెన్ ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌పై రిలయన్స్ డిజిటల్ ఆఫర్లు ప్రకటించింది.



ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై రూ.5వేల వరకు తక్షణ తగ్గింపు, దాదాపు రూ.8వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్‌లు అందిస్తుంది. రిలయన్స్ డిజిటల్ అవుట్‌లెట్‌లో ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 27న విడుదలయ్యే ఈ ఫోన్ ధర రూ.1,39,999. 'అద్భుతమైన వన్‌ప్లస్ ఓపెన్ స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకమైన ఆవిష్కరణ కోసం వన్‌ప్లస్‌తో జట్టుకట్టడం ఆనందంగా ఉంది. భారత కస్టమర్లకు సరికొత్త టెక్నాలజీని అందించడమే మా లక్ష్యం' రిలయన్స్ డిజిటల్ సీఈఓ బ్రియాన్ బాడే అన్నారు.

సాక్షి స్పోర్ట్స్



రష్మిక అలవోక విజయం

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. బ్యాంకాక్‌లో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక 6-1, 6-3తో నాలుగో సీడ్ హిరోకో కవాటా (జపాన్)పై గెలిచింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఎనిమిది ఏస్‌లు సంధించడం విశేషం.

రాణించిన త్రిష: హైదరాబాద్ ఘనవిజయం

బీసీసీఐ సీనియర్ మహిళల టి20 టోర్నీలో శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఇ' మ్యాచ్‌లో హైదరాబాద్ 83 పరుగులతో ఒడిశాను ఓడించింది. రాయ్‌పూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 158 పరుగులు చేసింది. గొంగడి త్రిష (54 బంతుల్లో 72; 11 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు అర్ధసెంచరీతో చెలరేగింది. అనంతరం ఒడిశా 16.5 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది.



చెలరేగిన వార్నర్, మార్ష్

- భారీ సెంచరీలు చేసిన ఓపెనర్లు
- పాకిస్తాన్‌పై 62 పరుగుల తేడాతో గెలిచిన ఆస్ట్రేలియా
- రాణించిన జంపా, స్టొయినిస్

బెంగళూరు: వరుస ఓటముల నుంచి తేరుకున్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పుంజుకుంది. వార్నర్, మార్ష్‌ల మెరుపులతో పాటు స్టొయినిస్ సూపర్ స్పెల్, ఆడమ్ జంపా స్పిన్ ఆసీస్‌ను గెలిపించాయి. శుక్రవారం జరిగిన ప్రపంచకప్ పోరులో ఆస్ట్రేలియా 62 పరుగుల తేడాతో పాకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. తొలుత ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 367 పరుగుల భారీస్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ వార్నర్ (124 బంతుల్లో 163; 14 ఫోర్లు, 9 సిక్సర్లు), మిచెల్ మార్ష్ (108 బంతుల్లో 121; 10 ఫోర్లు, 9 సిక్సర్లు) శతక్కొట్టారు. షాహీన్ అఫ్రిదికి 5 వికెట్లు దక్కాయి. తర్వాత పాకిస్తాన్ 45.3 ఓవర్లలో 305 పరుగుల వద్ద ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్లు ఇమాముల్ హక్ (71 బంతుల్లో 70; 10 ఫోర్లు), అబ్దుల్లా షఫీక్ (61 బంతుల్లో 64; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. జంపా 4, స్టొయినిస్ 2 వికెట్లు తీశారు.

సిక్సర్ల హోరు

వార్నర్ లాంటి డాషింగ్ ఓపెనర్‌కు 10, 105 స్కోర్ల వద్ద ఏకంగా రెండుసార్లు లైఫ్‌లు వస్తే ఎంత విధ్వంసం సృష్టిస్తాడో పాక్‌కు తెలిసొచ్చేలా చేశాడు. మరోవైపు మార్ష్ కూడా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో మైదానం సిక్సర్లతో హోరెత్తింది. వార్నర్ 85 బంతుల్లో వన్డేల్లో 21 సెంచరీని పూర్తి చేసుకోగా, మార్ష్ 100 బంతుల్లో రెండో శతకం సాధించాడు. 259 స్కోరు వద్ద మార్ష్‌ను షాహీన్ అవుట్ చేయడంతో పాక్ ఊపిరి పీల్చుకుంది. మ్యాక్స్‌వెల్ (0), స్మిత్ (7)లు నిరాశ పరిచినా... వార్నర్ ధాటి కొనసాగింది. 325 స్కోరు వద్ద రవూఫ్ అతని జోరుకు బ్రేకులేయడంతో 38 పరుగుల స్వల్ప వ్యవధిలో ఆసీస్ 6 వికెట్లను కోల్పోయింది.





వార్నర్

అప్పుడు... ఇప్పుడు...

12 ఏళ్ల క్రితం భారత ఉపఖండంలో జరిగిన 2011 ప్రపంచకప్‌లో జింబాబ్వేపై పల్లెకెలెలో లంక ఓపెనర్లు దిల్షాన్, తరంగ 282 పరుగులతో అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం నమోదు చేశారు. మళ్లీ ఇప్పుడు భారత్‌లో రెండో అత్యధిక భాగస్వామ్యాన్ని ఆసీస్ ఓపెనర్లు వార్నర్, మార్ష్‌లు సాధించారు. తొలి వికెట్‌కు 259 పరుగులు జోడించారు. మొత్తం 13 వరల్డ్‌కప్‌ల చరిత్రలో ఓపెనర్లు శతక్కొట్టడం ఇది నాలుగోసారి మాత్రమే!

పాక్ జోడీదీ అదే బాట

పాకిస్తాన్‌తో పోల్చితే ఆస్ట్రేలియా బౌలింగ్ దళం పదునైంది. కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్ అంతా నిప్పులు చెరిగే సమర్థులే! కానీ ఈ త్రయం పాక్ ఓపెనింగ్ జోడీని 21 ఓవర్లదాకా ప్రభావమే చూపలేకపోయింది. స్పిన్నర్లు జంపా, మ్యాక్స్‌వెల్‌లను బరిలోకి దించినా... షఫీక్-ఇమాముల్ జోడీ యథేచ్ఛగా తమ పరుగుల జోరు కొనసాగించడంతో వీరి ఇన్నింగ్స్ కూడా ఆసీస్ ఇన్నింగ్స్‌లా పరుగుల పట్టాలెక్కింది.



మార్ష్

షఫీక్ 52 బంతుల్లో, ఇమాముల్ 54 బంతుల్లో ఫిఫ్టీలు సాధించారు. అయితే స్టొయినిస్‌కు బంతిని అప్పగించాక పరిస్థితి మారింది. 134 స్కోరు వద్ద ఓపెనింగ్ జోడీని స్టొయినిస్ తొలి బంతికే విడగొట్టాడు. తన వరుస ఓవర్లలో షఫీక్, ఇమాముల్‌లను పెవిలియన్ చేర్చడంతో ఆట రూటు మారింది. జంపా స్పిన్ తిరగడంతో కెప్టెన్ బాబర్ ఆజమ్ (18), రిజ్వాన్ (40 బంతుల్లో 46; 5 ఫోర్లు), ఇఫ్తికార్ (20 బంతుల్లో 26; 3 సిక్సర్లు) ఎంతో సేపు నిలువలేదు. దీంతో పాక్ పరాజయం ఖాయమైంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) షాదాబ్ (సబ్) (బి) రవూఫ్ 163; మార్ష్ (సి) ఉసామ మీర్ (బి) షాహీన్ 121; మ్యాక్స్‌వెల్ (సి) బాబర్ (బి) షాహీన్ 0; స్మిత్ (సి అండ్ బి) ఉసామ మీర్ 7; స్టొయినిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షాహీన్ 21; ఇంగ్లిస్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 13; లబుషేన్ (సి) షాదాబ్ (సబ్) (బి) రవూఫ్ 8; కమిన్స్ (నాటౌట్) 6; స్టార్క్ (సి) షకీల్ (బి) షాహీన్ 2; హాజల్‌వుడ్ (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 0; జంపా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 367. వికెట్ల పతనం:** 1-259, 2-259, 3-284, 4-325, 5-339, 6-354, 7-360, 8-363, 9-363. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 10-1-54-5, హసన్ అలీ 8-0-57-0, ఇఫ్తికార్ 8-0-37-0, రవూఫ్ 8-0-83-3, ఉసామ మీర్ 9-0-82-1, నవాజ్ 7-0-43-0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 64; ఇమాముల్ (సి) స్టార్క్ (బి) స్టొయినిస్ 70; బాబర్ (సి) కమిన్స్ (బి) జంపా 18; రిజ్వాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 46; షకీల్ (సి) స్టొయినిస్ (బి) కమిన్స్ 30; ఇఫ్తికార్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 26; నవాజ్ (స్టంప్డ్) ఇంగ్లిస్ (బి) జంపా 14; ఉసామ మీర్ (సి) స్టార్క్ (బి) హాజల్‌వుడ్ 0; షాహీన్ అఫ్రిది (సి) లబుషేన్ (బి) కమిన్స్ 10; హసన్ అలీ (సి) ఇంగ్లిస్ (బి) స్టార్క్ 8; రవూఫ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (45.3 ఓవర్లలో ఆలౌట్) 305. వికెట్ల పతనం:** 1-134, 2-154, 3-175, 4-232, 5-269, 6-274, 7-277, 8-287, 9-301, 10-305. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 8-0-65-1, హాజల్‌వుడ్ 10-1-37-1, ప్యాట్ కమిన్స్ 7.3-0-62-2, ఆడమ్ జంపా 10-0-53-4, గ్లెన్ మ్యాక్స్‌వెల్ 5-0-40-0, స్టొయినిస్ 5-0-40-2.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	4	4	0	8	1.659
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	4	2	2	4	-0.456
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
బంగ్లాదేశ్	4	1	3	2	-0.784
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు



శ్రీలంక X నెదర్లాండ్స్
వేదిక: లక్నో
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ X దక్షిణాఫ్రికా
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

హెచ్‌సీఏ కొత్త అధ్యక్షుడిగా జగన్‌మోహన్ రావు ఎన్నిక

ఒక ఓటు తేడాతో విజయం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొత్త అధ్యక్షుడిగా అరిశనపల్లి జగన్‌మోహన్ రావు ఎన్నికయ్యారు. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఎన్నికల్లో యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ ప్యానెల్‌కు చెందిన జగన్‌మోహన్ రావు ఒక ఓటు తేడాతో తన సమీప ప్రత్యర్థి అమర్‌నాథ్ (క్రికెట్ ఫస్ట్ ప్యానెల్)పై విజయం సాధించారు. జగన్‌మోహన్‌కు 63 ఓట్లు రాగా, అమర్‌నాథ్‌కు 62 ఓట్లు లభించాయి. అధ్యక్ష పదవికి బరిలో నిలిచిన అనిల్‌కుమార్‌కు 34, పీఎల్ శ్రీనివాస్‌కు 10 ఓట్లు దక్కాయి. మొత్తం 173 ఓట్లు అందుబాటులో ఉండగా నలుగురు ఓటర్లు గైర్హాజరయ్యారు. దాంతో 169 ఓట్లు పోలయ్యాయి. ఆరు పదవుల కోసం నాలుగు ప్యానెల్‌ల నుంచి 24 మంది పోటీ పడ్డారు. తాజా ఫలితాలతో హెచ్‌సీఏలో ఎట్టకేలకు అధికారికంగా ఎన్నికైన కార్యవర్గం బాధ్యతలు చేపట్టనుంది. అక్షర గ్రూప్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ చైర్మన్ అయిన జగన్‌మోహన్ రావు భారత హ్యాండ్‌బాల్ సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం హెచ్‌సీఏ నిర్వహించిన తెలంగాణ ప్రీమియర్ లీగ్‌లో మెదక్ మావెరిక్స్ జట్టుకు యజమానిగా ఆయన క్రికెట్ వ్యవహారాల్లోకి అడుగుపెట్టారు. యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ నుంచి ఇద్దరు, క్రికెట్ ఫస్ట్ ప్యానెల్ నుంచి ఇద్దరు, గుడ్ గవర్నెన్స్ ప్యానెల్‌ను ఇద్దరు చొప్పున విజయం సాధించగా, ఆనెస్ట్ హార్డ్ వర్కింగ్ హెచ్‌సీఏ ప్యానెల్ నుంచి ఎవరూ నెగ్గలేదు.



హెచ్‌సీఏ కొత్త కార్యవర్గం: ఎ.జగన్‌మోహన్ రావు (అధ్యక్షుడు), దల్జీత్ సింగ్ (ఉపాధ్యక్షుడు), ఆర్.దేవరాజ్ (కార్యదర్శి), బసవరాజు (సంయుక్త కార్యదర్శి), సీజే శ్రీనివాస్ (కోశాధికారి), సునీల్ కుమార్ (కౌన్సిలర్).

న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరం

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గాయపడిన భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో ఆదివారం ధర్మశాలలో జరిగే తదుపరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో తన బౌలింగ్‌లోనే బంతిని ఆపే ప్రయత్నంలో గురువారం పాండ్యా చీలమండకు గాయమైంది. వెంటనే బౌలింగ్ నుంచి తప్పుకున్న అతడిని స్కాన్‌ల కోసం ఆస్పత్రికి పంపించారు. గాయం తీవ్రమైంది కాదని కెప్టెన్ రోహిత్ ఇప్పటికే ప్రకటించాడు. అయితే ముందు జాగ్రత్తగా విశ్రాంతి కోసం తర్వాతి మ్యాచ్‌ను పక్కన పెట్టినట్లు బీసీసీఐ ప్రకటించింది. తదుపరి చికిత్స కోసం అతను బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీకి వెళతాడు. అనంతరం ఈ నెల 29న ఇంగ్లండ్‌తో భారత్ ఆడే మ్యాచ్ కోసం పాండ్యా నేరుగా లక్నో చేరుకుంటాడు.



సెమీస్‌లో సింధు

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సింధు 21-19, 21-12తో సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్‌లో గట్టిపోటీ ఎదురైంది. అయితే రెండో గేమ్‌లో సింధు పూర్తి ఆధిపత్యం చలాయించి విజయాన్ని ఖాయం చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో కరోలినా మారిన్ (స్పెయిన్)తో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 5-10తో వెనుకబడి ఉంది. క్వార్టర్ ఫైనల్లో కరోలినా మారిన్ 19-21, 21-15, 21-18తో తై జు యింగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది.




సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 21 । అక్టోబర్ । 2023



అన్నదానానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పన్నాల లక్ష్మి నరసింహం దంపతులు శుక్రవారం రూ.25,001 విరాళాన్ని అందజేశారు.



డెల్టాలకు 14,700 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,200 క్యూసెక్కులు వదిలారు.

26న సీఎం జగన్ రాక



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 26న జిల్లాకు రానున్నారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు అనుమతి లేకుండా ఉద్యోగులు ఎవ్వరూ సెలవులపై వెళ్లరాదన్నారు. జిల్లాలో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు.

న్యూస్‌రీల్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): **జగనన్న** ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో **భాగంగా శని** వారం ఈ కింద తెలిపిన **సచివాలయాలు,** ఆరోగ్య కేంద్రాల్లో వైద్యశిబిరాలు **నిర్వహిస్తు**న్నట్టు కలెక్టర్ మాధవీలత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పేరా రామచంద్రపురం (అనపర్తి మండలం), పందలపాక 2 (బిక్కవోలు), బ్రాహ్మణగూడెం-1 (చాగల్లు), యర్నగూడెం-2 (దేవరపల్లి), కొత్తపల్లి-2 (గోకవరం), కడియపులంక-4 (కడియం), మునగాల (కోరుకొండ), చోడవరం ఈస్ట్ (నల్లజర్ల), తిమ్మరాజుపాలెం (నిడదవోలు), ఎన్టీఆర్ కాలనీ వీక్లీ మార్కెట్ (నిడదవోలు అర్బన్), ఖండవల్లి-1 (పెరవలి), హుకుంపేట-1 (రాజమహేంద్రవరం రూరల్), తోకాడ-2 (రాజానగరం), వడిశలేరు-2 (రంగంపేట), కూనవరం (సీతానగరం), పసలపూడి (ఉండ్రాజవరం)లో జరుగుతాయన్నారు.

ఉద్యోగుల స్పందనకు 13 అర్జీలు



ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రత్యేక స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్.తేజ్ భరత్ డీఆర్వో నరసింహులు.. ఉద్యోగుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మూడో శుక్రవారం స్పందన నిర్వహిస్తున్నామన్నారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు 13 అర్జీలు అందజేశారన్నారు. సర్వీస్ మేటర్, పదోన్నతులు, ఇతర సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.


నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు



దేవీచౌక్ వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భువనేశ్వరి

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి మూలా నక్షత్రం సందర్భంగా గోదావరి గట్టు వద్ద ఉమా శ్రీ మార్కండేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవీచౌక్‌లో శ్రీ కనదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. పురోహితులు వేద మంత్రాలతో ఆమెను ఆశీర్వదించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. తర్వాత క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు భువనేశ్వరిని కలిసి సంఘీభావం తెలిపారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు చంద్రబాబును జైల్లో పెట్టించారని టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి సీఎం జగన్‌పై ఆరోపణలు చేశారు. లోకేష్ శిబిరం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. నీటి పారుదల రంగం కుదేలై పంటలు ఎండిపోతున్నాయన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ధాన్యం తడిసినా రైతులకు నిశ్చింత



మెకనైజ్డ్ మండీ యార్డు డిజైన్

- మెకనైజ్డ్ మండీ యార్డులకు సన్నాహాలు
- ఉత్తరాది రాష్ట్రాల తరహాలో ఏర్పాటు
- ప్రయోగాత్మకంగా జిల్లాకు ఒకటి ఎంపిక
- తడిసిన ధాన్యం ఆరబెట్టేందుకు డ్రయ్యర్లు
- అక్కడే లేబొరేటరీ, వాహనాలకు పార్కింగ్
- ఒకచోట అందుబాటులో అన్ని రకాల సేవలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రైతు పక్షపాతిగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే గ్రామానికి చేరువలోనే రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ఏర్పాటు ద్వారా అన్నదాతకు చేదోడు వాదోడుగా నిలుస్తూండగా.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. వర్షం వస్తే కళ్లాల్లో తడిసిన ధాన్యంతో పడుతున్న ఇబ్బందులను తొలగించాలని సంకల్పించింది. ఈ ధాన్యాన్ని అమ్ముకోలేక రైతులు ఏటా నష్టపోతున్నారని గుర్తించింది. ఈ తరహా కష్టాలను తొలగించేందుకు మెకనైజ్డ్ మండీ యార్డులు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో మాదిరిగా వీటిని అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. తొలి దశలో ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాలో ఒక యార్డును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకయ్యే పూర్తి వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ యార్డులు ఏర్పాటు చేయనుంది. మండీల నిర్మాణానికి ప్రతి జిల్లాలో ఆరెకరం తక్కువ కాకుండా స్థలం అవసరమవుతుంది. స్థలం ఎంపికపై పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఖరీఫ్ ధాన్యం చేతికొచ్చే నాటికి మండీలను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా అడుగులు వేస్తున్నారు.

ఇబ్బందులు ఎదురవ్వకుండా చర్యలు

విత్తన సీజన్ మొదలైన దగ్గర నుంచి పంట దిగుబడులు విక్రయించేంత వరకూ ఆర్‌బీకేల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ధాన్యం కొనుగోలు సందర్భంగా ఎటువంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. మద్దతు ధరకే ప్రతి గింజా కొనుగోలు చేస్తోంది. అయితే తడిసిన ధాన్యం కొనుగోలు చేసే సందర్భంలో ఆర్‌బీకేల వద్ద ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరిపడా ఖాళీ స్థలాలు, ప్లాట్‌ఫారాలు లేక ధాన్యం ఆరబెట్టుకోవడానికి వీలు కావడం లేదని ప్రభుత్వం గుర్తించింది. ప్రత్యామ్నాయం లేక తడిసిన ధాన్యాన్ని తమ కళ్లాల్లోనే ఆరబెట్టి ఆర్‌బీకేలకు తరలించడం రైతులకు ఇబ్బందిగా మారింది. అప్పటికీ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయడానికే పరిమితం కాకుండా రవాణా చార్జీలు, సంచుల ఖర్చులు కూడా భరిస్తోంది. ఈ నేపథ్యంలోనే తడిసిన ధాన్యం అమ్ముకోవడంలో ఎదురవుతున్న ప్రతిబంధకాలను కూడా తొలగించేందుకు మెకనైజ్డ్ మండీ యార్డుల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది.



పంజాబ్‌లోని ఈ తరహా మెకనైజ్డ్ మండీ యార్డులు ఏర్పాటుకు సన్నాహాలు



కాకినాడ జిల్లాలో ఎంపిక చేసిన నడకుదురు మార్కెట్ యార్డు

ప్రత్యామ్నాయంపై దృష్టి

ఆర్‌బీకేలలో స్థలాభావం దృష్ట్యా ప్రత్యామ్నాయంగా వ్యవసాయ మార్కెట్ యార్డులను అధికారులు ప్రతిపాదించారు. కాకినాడ జిల్లాలో కరప మండలం నడకుదురు వ్యవసాయ మార్కెట్ యార్డు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ యార్డును అధికారులు పరిశీలించారు. తూర్పు గోదావరి జిల్లాలో రైతులకు అందుబాటులో ఉండే స్థలంపై అధికార యంత్రాంగం పరిశీలన జరుపుతోంది. వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో వివిధ సేవల కోసం రైతులు ఎటూ వస్తూంటారు. అందువల్ల ఇక్కడే యార్డులు ఏర్పాటు చేయడం మంచిదనే నిర్ణయానికి వచ్చారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మెకనైజ్డ్ మండీలో రెండేసి డ్రయ్యర్లు, విశాలమైన సిమెంట్ ప్లాట్‌ఫాం, 20 వాహనాల పార్కింగ్, వేయింగ్ మెషీన్, ఆధునిక పరిజ్ఞానంతో లేబొరేటరీ, ధాన్యాన్ని సంచుల్లో నింపి కుట్టే చాంబర్ లాంటి వసతులు కల్పించనున్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ యార్డులు ఏర్పాటు చేయనున్నారు.



తడిసిన ధాన్యంలో తేమశాతం తగ్గించే యంత్రం

ఆర్‌బీకేల వద్ద ఓకే .. కానీ..

- రైతులు గతంలో మాదిరిగా కాకుండా తడిసిన ధాన్యాన్ని నేరుగా మెకనైజ్డ్ మండీ యార్డులకు తీసుకు రావచ్చు.
- యార్డులోని ప్లాట్‌ఫాంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవచ్చు.
- కొంచెం ఆరిన తర్వాత ధాన్యాన్ని డ్రయ్యర్లో వేసి పూర్తిగా తేమ శాతాన్ని తగ్గించేస్తారు.
- పూర్తిగా ఆరబెట్టాక ధాన్యాన్ని సంచుల్లో నింపి తూకానికి పంపిస్తారు.
- పౌర సరఫరాల కార్పొరేషన్‌తో రెవెన్యూ యంత్రాంగం సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియ చేపడుతుంది.
- జిల్లాకు ఒక మండీని తొలుత ప్రయోగాత్మకంగా ఆర్‌బీకే పరిధిలో ఏర్పాటు చేయ తలపెట్టారు.
- ఇందుకు కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం-4 ఆర్‌బీకేలను ఎంపిక చేశారు.
- ఆర్‌బీకేల పరిధిలో మండీ యార్డుల ఏర్పాటుకు తగిన మేర స్థలాలు లేవు. 5 నుంచి 10 సెంట్లు మాత్రమే స్థలాలు ఉండటంతో యార్డుల ఏర్పాటు కష్టమని పౌర సరఫరాల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.
- రైతులకు అన్ని సేవలూ ఒకేచోట కల్పించాలంటే ఆరెకరం నుంచి 80 సెంట్లయినా ఉండాలని భావిస్తున్నారు.
- విశాలమైన ప్లాట్‌ఫాంలు, డ్రయ్యర్లు, వేయింగ్ మెషీన్లు, వాహనాల పార్కింగ్.. ఇలా అన్ని సౌకర్యాలతో మండీ ఏర్పాటు చేయడం ఆర్‌బీకేల వద్ద సాధ్యం కాదని తేల్చారు.

మండీలో అన్ని సేవలూ ఒకేచోట



రైతులకు అన్ని సేవలూ ఒకేచోట అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రభుత్వం మెకనైజ్డ్ మండీ యార్డులు ఏర్పాటు చేస్తోంది. దీనివలన తడిసిన ధాన్యాన్ని తీసుకువచ్చి, అక్కడే ఆరబెట్టి సంచుల్లో నింపి, విక్రయించుకునే వెసులుబాటు లభించనుంది. ఇందుకు అనువైన స్థలాలు ఆర్‌బీకేల వద్ద లేకపోవడంతో వ్యవసాయ మార్కెట్ యార్డులను గుర్తించాం. యార్డుల్లో స్థలం ఉచితంగా కేటాయిస్తే మిగిలిన అన్నింటికీ సుమారు రూ.10 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నాం.

– డి.పుష్పమణి, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల కార్పొరేషన్, కాకినాడ

పోలీసు అవుట్ పోస్టుకు శాశ్వత భవనం



అవుట్ పోస్టు ఏర్పాటుపై డీఎస్పీ వీఎస్ఎన్ వర్మతో చర్చిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

హోంమంత్రి తానేటి వనిత

కొవ్వూరు: పట్టణంలో రోడ్డు కం రైలు వంతెన టోల్‌గేట్ జంక్షన్ వద్ద పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. జంక్షన్‌లో శిథిలావస్థలో ఉన్న ఓ భవనాన్ని చూశారు. రోడ్డు కం రైలు వంతెనపై ప్రమాదాలు, ఆత్మహత్యలకు పాల్పడిన వారిని రక్షించేందుకు గతంలో పోలీసు,అగ్నిమాపక సిబ్బందిని నియమించారు. ఇందులో భాగంగా టోల్‌గేట్ జంక్షన్ వద్ద అవుట్‌పోస్టును కూడా ఏర్పాటు చేశారు. ఈ అవుట్ పోస్టుకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని అధికారులు సంకల్పించారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి శిథిల భవనమున్న చోట అవుట్ పోస్టు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి తెలిపారు. ఆమె వెంట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ,జడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ,మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు,తోట రామకృష్ణ, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణీ.. కోటసత్తెమ్మ



ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో కోటసత్తెమ్మ అమ్మవారి దర్శనానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మూలనక్షత్రం సందర్భంగా ఉచిత సామూహిక సరస్వతి పూజ కార్యక్రమాల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

చదువుల తల్లి.. కల్పవల్లి..



దేవీచౌక్‌లో సరస్వతి అలంకరణలో అమ్మవారు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానాన్ని ప్రసాదించే జగజ్జననిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. తల్లితండ్రులు తమ చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో అమ్మవారిని సరస్వతిగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు తమ పిల్లలతో పూజలు చేయించారు.

ధాన్యం సేకరణకు పూర్తి ఏర్పాట్లు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఖరీఫ్ ధాన్యం సేకరణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్ పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు రూపొందించిందన్నారు. ధాన్యం సేకరణ సందర్భంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో రెండు దశల్లో 130 ఆర్బీకేల పరిధిలో కొనుగోలు కేంద్రాలను సన్నద్ధం చేసినట్లు తెలిపారు. మూడో దశలో మిగిలిన 101 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ లక్ష్యాలను వీఆర్వో, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో సాధించాలన్నారు. జిల్లాలో 1,03,726 మెట్రిక్ టన్నుల ఎరువులు లక్ష్యానికి అనుగుణంగా ప్రస్తుతం 32,062 మెట్రిక్ టన్నులు ఆర్బీకేల వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. వాటిలో సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల లావాదేవీలు నిర్వహించామని, డిమాండ్‌కు అనుగుణంగా రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. చైర్ పర్సన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో అర్హత ఉన్న ప్రతి ఒక్క కౌలు రైతుకూ సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే తేజా, జి.జనార్దనరావు, ఆదర్శ రైతులు ఎం.నరసింహారావు, డి.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.నంద కిషోర్ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

- వేదికైన రాజమహేంద్రవరం
- ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఎన్నికల యూనిట్లు
- బెల్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో మొదటి దశ తనిఖీలు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఎఫ్‌సీఐ వద్ద ఏర్పాట్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రానున్న ఎన్నికలలో ఓట్ల లెక్కింపునకు జిల్లా ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరం వేదిక కానుంది. అందుకు అనుగుణంగా స్థానిక ఫుడ్ కార్పొరేషన్ ఇండియా (ఎఫ్‌సీఐ)ని ఈవీఎంలు భద్రపర్చడానికి అనువైన స్థలంగా ఎంపిక చేశారు. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడలో లెక్కింపు జరిగేది. జిల్లాల విభజన నేపథ్యంలో రాజమహేంద్రవరం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో ఎన్నికల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొదటి దశ తనిఖీలు

ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం ఎన్నికల యూనిట్ల మొదటి దశ తనిఖీలను అత్యంత జాగ్రత్తతో, భారీ భద్రతల మధ్య కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నారు. జిల్లాకి కేటాయించిన ఎన్నికల యూనిట్లను బెంగళూర్ బెల్ సంస్థకు చెందిన సీనియర్ సాంకేతిక ఇంజినీర్లు పరిశీలన చేస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈ ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోసం వినియోగించే ఈవీఎంలు, అనుబంధ పరికరాల తనిఖీని బెల్ కంపెనీ ప్రతినిధులు ఈనెల 16న ప్రారంభించారు. 25వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఏ రోజుకారోజు నివేదికను ఈసీఐకి అందజేస్తున్నారు.

అత్యంత పటిష్టంగా..

జిల్లాకు చెందిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీప్యాట్లను తనిఖీలు చేస్తున్నారు. మొదటి రోజు 160 యూనిట్లను, రెండో రోజు 220 యూనిట్లను పరిశీలించారు. ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ ప్రక్రియ జరుగుతోంది. ఈ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎవ్వరూ ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు ఉపయోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ఎస్పీ జగదీష్‌తో కలిసి కలెక్టర్ మాధవీలత భద్రతా చర్యలను పరిశీలించారు. ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన సూచనలు చేశారు. ఈ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు తమ సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఇక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్‌లో డిపాజిట్ చేయాలి. విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్క అధికారిని, సిబ్బందిని, రాజకీయ పార్టీల ప్రతినిధులను తనిఖీ చేసి, జాబితా మేరకు అనుమతిస్తున్నారు.

వెబ్ కాస్టింగ్‌లో రికార్డ్

ఎఫ్ఎల్‌సీ తనిఖీ చేసే ప్రక్రియను పూర్తిగా వెబ్ కాస్టింగ్‌లో రికార్డ్ చేస్తున్నారు. తనిఖీల కోసం 140 మంది సిబ్బందిని నియమించారు. మొత్తం 140 సిబ్బందిని 20 టీమ్‌లుగా నియమించారు. ఒక్కొక్క బృందంలో ఆరుగురు చొప్పున, మిగిలిన 20 మందిని రిజర్వ్‌లో ఉంచారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో తనిఖీలు జరుగుతున్నారు.

కొత్త జిల్లాలో తొలి ఎన్నికలు

రాజమహేంద్రవరం కేంద్రంగా నూతనంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో తొలి సార్వత్రిక ఎన్నికల కోసం మొదటి దశ తనిఖీలను భద్రత ఏర్పాట్లు మధ్య నిర్వహిస్తున్నాం. రాజకీయ పార్టీల ప్రతినిధుల నడుమ బెల్ కంపెనీ ఇంజినీర్లు అధీకృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పటిష్టంగా భద్రతా ఏర్పాట్లు చేశాం.

– కె.మాధవీలత, కలెక్టర్

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ శివారు రాజుపాలెం గ్రామంలో ఈ నెల 19వ తేదీన అదృశ్యమైన చింతకింద ఆంజనేయులు (65) మృతదేహం శుక్రవారం మురమళ్ల వద్ద గోదావరిలో లభ్యమైంది. పెయింటింగ్ పని చేస్తూ జీవించే ఆంజనేయులు ఈ నెల 19న సైకిల్‌పై బయటకు వెళ్లాడు. అక్కడి నుంచి గోదావరి ఒడ్డుకు బహిర్భూమికి వెళ్లగా ప్రమాదవశాత్తూ ఆ నదిలో పడి మృతి చెందాడు. ఆంజనేయులు మృతదేహం మురమళ్ల పుష్కర ఘాట్ వద్ద తేలింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులకు అక్కడకు చేరుకుని, ఆ మృతదేహం ఆంజనేయులుదిగా గుర్తించారు. ముమ్మిడివరం హెడ్ కానిస్టేబుల్ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆంజనేయులుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్తంభం తగిలి వ్యక్తి మృతి

దేవరపల్లి: సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేస్తున్న స్తంభం తగిలి ఓ మోటార్ సైక్లిస్ట్ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవరపల్లిలో కొంత కాలం నుంచి సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయి. స్థానిక మూడు రోడ్ల కూడలిలో శుక్రవారం స్తంభం నిలబెట్టడానికి క్రేన్‌తో జరుపుతున్నారు. అదే సమయంలో మండలంలోని గౌరీపట్నానికి చెందిన కుంచం సత్యానందం (30) దేవరపల్లి నుంచి గోపాలపురం వైపు టీవీఎస్ మోపెడ్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్తంభం తగిలి, తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. క్రేన్ ఆపరేటర్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.



స్తంభం తగిలి మృతి చెందిన సత్యానందం



ద్రాక్షారామలో జరిగిన సామూహిక సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు



సింహవాహనం అలంకరణలో దర్శనమిచ్చిన కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి అమ్మవారు



బాలాత్రిపురసుందరి ఆలయంలో సరస్వతీపూజల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీవాణీ.. విద్యావర్షిణీ..

- వివిధ ఆలయాల్లో చదువుల తల్లిగా అమ్మవార్లు
- ద్రాక్షారామ, కాకినాడ, పిఠాపురాల్లో సామూహిక సరస్వతీ పూజలు
- వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు



సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీరాజరాజేశ్వరి దేవి

రామచంద్రపురం రూరల్/సామర్లకోట/బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): 'సరస్వతీ నమస్తుభ్యం' అంటూ ఆ చదువుల తల్లికి విద్యార్థులు భక్తితో పూజలు చేశారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మూల నక్షత్రం సందర్భంగా.. సమస్త చదువులనూ కటాక్షించే సరస్వతీ దేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో సరస్వతీ పూజలు ఎంతో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే విద్యార్థులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.

- అష్టాదశ శక్తిపీఠాల్లో పన్నెండోదిగా, పంచారామ క్షేత్రంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, సువర్ణ, రజత పుష్పార్చన నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన సామూహిక సరస్వతీ దేవి పూజల్లో సుమారు 3 వేల మంది చిన్నారులు తల్లిదండ్రులతో కలసి పాల్గొన్నారు. అమ్మవారి పూజలో ఉంచిన పుస్తకాలు, పెన్నులను ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యాన సిబ్బంది చిన్నారులకు అందజేశారు. సరస్వతీ అలంకరణలో మాణిక్యాంబ అమ్మవారిని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, రామచంద్రపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గా రావు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.
- సామర్లకోటలోని పంచారామ క్షేత్రం శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.
- కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన సరస్వతీ పూజల్లో 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారితో ప్రధానార్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం పూజలు చేయించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు.



శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో చదువుల తల్లిగా బాలాత్రిపురసుందరీదేవి

- కాకినాడ శ్రీపీఠంలో ఐశ్వర్యాంబికాదేవి అమ్మవారి సన్నిధిలో సుమారు 2 వేల మంది చిన్నారులు భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజలు చేశారు. చిన్నారులకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు అందించారు.
- పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహించిన సరస్వతీ పూజల్లో కూడా చిన్నారులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన పెన్నులు, పుస్తకాలు ఉచితంగా అందించారు.

సరస్వతీ కటాక్షం.. జ్ఞానానికి మార్గం

రాయవరం: సరస్వతీ కటాక్షం జ్ఞానానికి మార్గమని, ఆ తల్లి ఆశీస్సులుంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చునని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పీఠానికి వచ్చిన భక్తులనుద్దేశించి ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. జ్ఞానప్రదాయిని అయిన సరస్వతీ అమ్మవారి కరుణాకటాక్షాలు కలగడం పూర్వజన్మ సుకృతమన్నారు. జ్ఞానసంపన్నులుగా రాణించాలంటే మంచి వాక్శుద్ధి లభించాలని, అందుకు అమ్మవారి దయకు పాత్రులు కావడానికి ప్రయత్నించాలని అన్నారు. శరన్నవరాత్రుల్లో సరస్వతీ అవతారం ప్రాధాన్యాన్ని ఆయన వివరించారు. మూల పూజలు ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో పీఠం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. పలువురు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి గాడ్ ఆశీస్సులు పొందారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి, పూజలు చేశారు. విద్యాబుద్ధులు కలగాలని ప్రార్థిస్తూ చిన్నారులతో చీమ లకొండ వీరావధాని, శ్రీనివాస్, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్రశర్మల అర్చకత్వంలో సరస్వతీ అష్టోత్తర సహస్రనామాలతో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సరస్వతీదేవి ప్రతిమ, రక్షాబంధనాన్ని ప్రసాదంగా అందజేశారు. గాడ్ సమక్షంలో పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పీఠం పీఆర్‌ఓ వాడ్రేవు వేణుగోపాల్(బాబీ) ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.



సరస్వతీదేవిగా వెదురుపాక విజయదుర్గా అమ్మవారు

కేపీఆర్ ఉద్యమకారులపై కేసుల ఉపసంహరణ

- ఆరు గ్రామాల ప్రజల హర్షం
- సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు

రంగంపేట: కేపీఆర్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై పదేళ్ల కిందట నమోదు చేసిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించింది. ఈ మేరకు ఈ కేసులను తొలగిస్తూ పెద్దాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఆరు గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలివీ.. ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరులో కేపీఆర్ థర్మల్ ప్లాంట్, కాస్టిక్ సోడా పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. అయితే, దీనికి వ్యతిరేకంగా జి.దొంతమూరు, బాలవరం, వీరంపాలెం, వీరంపాలెం పాకలు, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాలకు చెందిన ప్రజలు పదేళ్ల కిందట ఉద్యమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారులైన 49 మందిపై 2013లో రంగంపేట పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అప్పటి నుంచీ వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని నాడు విపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్ప పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆయన ముఖ్యమంత్రి అయిన అనంతరం కేపీఆర్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై నమోదైన అన్ని కేసులూ ఎత్తివేస్తూ 2022లో జీఓ నంబరు 321 ఇచ్చారు. దీని ప్రకారం 49 మందిపై వివిధ సెక్షన్ల కింద నమోదైన కేసులను కోర్టు తొలగించింది.

నాడు పట్టించుకోని టీడీపీ

కేపీఆర్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారిపై కేసులు తొలగించడంతో ఆరు గ్రామాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామాలకు చెందిన దుప్పలపూడి చిట్టిబాబు, చెక్కపల్లి నాని, ముత్యం వీరబాబు తదితరులు మాట్లాడుతూ, తమపై కేసులు ఎత్తివేసే విషయాన్ని నాటి టీడీపీ నాయకులు ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయిస్తామంటూ అప్పటి టీడీపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (అనపర్తి), రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్ హామీ ఇచ్చి వదిలేశారని చెప్పారు. కానీ ప్రస్తుత డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత కేసుల ఎత్తివేతకు చిత్తశుద్ధితో కృషి చేశారని తెలిపారు. తమపై కేసులు ఎత్తివేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ఆరు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మాట తప్పని నేత సీఎం జగన్



కేపీఆర్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించినవారిపై కేసులు ఎత్తివేయిస్తామని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీ మాగంటి మురళీమోహన్ చెప్పి, ఎన్నికల్లో లబ్ధి పొందారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యమకారుల ఊసే పట్టించుకోలేదు. ఫలితంగా కేసులు నమోదైన వారు కోర్టుల చుట్టూ తిరిగేవారు. ఆ సమయంలో ప్రజాసంకల్ప పాదయాత్రలో భాగంగా నాటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మామిడాడ వచ్చారు. కేపీఆర్ ఉద్యమకారులపై కేసుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాను. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ కేసులన్నీ ఎత్తివేస్తామని అప్పట్లో ఆయన హామీ ఇచ్చారు. ఆ మాట ప్రకారం ముఖ్యమంత్రి అయిన తరువాత కేసులు ఎత్తివేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీఓ జారీ చేయించి మాట తప్పని, మడమ తిప్పని నేతగా నిరూపించుకున్నారు. కేసుల ఉపసంహరణ ఎంతో సంతోషం కలిగిస్తోంది.

– డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే, అనపర్తి

చిట్టీల వ్యాపారి అదృశ్యం

- రామవరం వద్ద రోడ్డుపై పడి ఉన్న బైక్, చెప్పులు
- గాలిస్తున్న పోలీసులు, కుటుంబ సభ్యులు

జగ్గంపేట: మండలంలోని రామవరం గ్రామ శివారున ఓ చిట్టీల వ్యాపారి అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. రోడ్డుపై వ్యాపారి మోటార్ సైకిల్, చెప్పులు పడి ఉండగా వాటిపై రక్తపు మరకలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. జగ్గంపేట పరిసరాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు కథనం ప్రకారం.. పెద్దాపురం మండలం దివిలి గ్రామానికి చెందిన కాకి నందకుమార్ (36) చిట్టీల వ్యాపారం చేస్తుంటాడు. అతడికి దివిలిలో వేరే వ్యాపారాలు కూడా ఉన్నాయి. వ్యాపార పనులు, బాకీ వసూళ్ల కోసం గురువారం జగ్గంపేట మీదుగా గోకవరం వెళ్లి, మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యాడు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో తాను జగ్గంపేటలో ఉన్నానని కొద్దిసేపట్లోనే ఇంటికి వచ్చేస్తానని తన సోదరుడు మురళీకృష్ణకు ఫోనులో చెప్పాడు. ఈ నేపథ్యంలో జగ్గంపేట నుంచి రామవరం మీదుగా దివిలి వెళ్తుండగా రామవరం శివారు ప్రాంతంలో అదృశ్యమయ్యాడు. ఆ ప్రాంతంలో అతడి బైక్, చెప్పులు పడి ఉన్నాయని మధ్యాహ్నం 3 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకుని నందకుమార్ కోసం గాలింపు చేపట్టారు. బైక్ ప్రమాదంలో గాయపడితే ఎవరైనా ఆసుపత్రుల్లో చేర్చారా అనే అనుమానంతో కూడా వెతికారు. ఏ ఆసుపత్రిలోనూ నందకుమార్ ఆచూకీ లేకపోవడంతో సోదరుడు మురళీకృష్ణ గురువారం రాత్రి జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అదృశ్యం కేసు నమోదు చేసి, గాలింపు ప్రారంభించామని ఎస్సై నాగర్జునరాజు తెలిపారు.



అదృశ్యమైన నందకుమార్ (పాత చిత్రం)

గోకవరంలో గొడవ పడ్డాడా?

తన సోదరుడు నందకుమార్‌కు చిట్టీల వ్యాపారంలో కొన్ని బకాయిలున్నాయని, వీటి వసూలుకు గతంలో గోకవరం వెళ్లి ఒక వ్యక్తితో గొడవ పడినట్టు తెలిసిందని మురళీకృష్ణ చెప్పాడు. ఈ నేపథ్యంలో అతడు గోకవరం వెళ్లి తిరిగి వస్తుండగా అదృశ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నాడు. రామవరం వరకూ వచ్చిన నందకుమార్ మోటార్ సైకిల్ వెళ్లిన కొద్దిసేపటికే వెనకాల ఒక కారు వెళ్లినట్లు సీసీ కెమెరాలు పరిశీలిస్తే తెలిసిందని చెప్పాడు. అయితే ఆ కారు అటు గోనాడ వైపు కానీ, తిరిగి జగ్గంపేట వైపు కానీ రాలేదంటూ అనుమానం వ్యక్తం చేశాడు. తమ సోదరుడిపై ఎవరైనా దాడి చేసి, కిడ్నాప్ చేశారా అనే అనుమానం వ్యక్తం చేశాడు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

కాట్రేనికోన: హత్యాయత్నం, లైంగిక దాడి యత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం జిల్లా న్యాయమూర్తి వై.బయ్యన్ననాయుడు తీర్పు చెప్పారు. అమలాపురం డీఎస్పీ అంబికా ప్రసాద్ కథనం ప్రకారం.. కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలోని ఓ ఒంటరి మహిళపై పల్లంకుర్రు పంచాయతీ పోర గ్రామానికి చెందిన డొక్కాడి పెద మాతరాజు 2018లో లైంగిక దాడికి ప్రయత్నించాడు. ఆమె ఆత్మరక్షణ కోసం ప్రతిఘటించి, అతడిపై కత్తితో దాడి చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై టి.క్రాంతికుమార్ దర్యాప్తు చేసి, పెద మాతరాజుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో 13 మంది సాక్షులను విచారించారు. ఇరువర్గాల వాదోపవాదనల అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు. ముద్దాయిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కలెక్టర్ మాధవీలతకు మొక్క అందజేస్తున్న ఎస్పీఎఫ్ కమాండెంట్ నరసింహారావు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ డాక్టర్ కె.నరసింహారావు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీఎఫ్ జోనల్ కార్యాలయం నిర్మాణానికి, శిక్షణా సంస్థను నెలకొల్పడానికి రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఎస్పీఎఫ్ కీలక భూమిక పోషిస్తోందన్నారు.

ఉచిత న్యాయసేవలపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా న్యాయసేవాధికారసంస్థ అందిస్తున్న ఉచిత న్యాయసేవలు, వివిధ నల్సా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లకు ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సూచించారు. వారితో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రమాదంలో ఉన్న పిల్లలు, మహిళలు, కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, వృద్ధులు, సామాన్యుల గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలపాలన్నారు.

యువమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మనోజ్



రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కందుకూరి మనోజ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కందుకూరి మనోజ్ అనేక సమస్యలపై పోరాటం చేయడంతో పాటు, పార్టీని ముందుకు తీసుకువెళుతున్నారన్నారు.

6న సీపీఎం బహిరంగ సభ

ప్రకాశం నగర్: రాజమహేంద్రవరంలో నవంబర్ ఆరున సీపీఎం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాలు సొంత అజెండాల చుట్టూ తిరుగుతున్నాయని విమర్శించారు. వాటిని ప్రజా సమస్యల చుట్టూ మళ్లించే విధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కులగణనను తాము స్వాగతిస్తామని తెలిపారు. కేంద్రం ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు జువ్వల.రాంబాబు, పి.తులసి, బి.రాజులోవ, ఎస్.రాజా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడియం: విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కడియపుసావరం గ్రామానికి చెందిన భూషణశెట్టి ప్రణీత నాగచైతన్యకు రూ.67 వేల ఆర్థిక సాయం అందజేశారు. కడియం మండల కాపు ఐక్యవేదిక వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన ఈ మొత్తాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సావరం సర్పంచ్ చక్కపల్లి మురళి, స్థానిక నాయకులు సాపిరెడ్డి కామేష్, కళ్యాణం సూరిబాబు, గంధం వీరబాబు, ప్రసాద్, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: లియో
సూర్యమినీ	: టైగర్ నాగేశ్వరరావు
సూర్యప్యాలెస్	: భగవంత్ కేసరి
స్వామి	: టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి	: లియో
అనుశ్రీ	: భగవంత్ కేసరి
రాజా	: టైగర్ నాగేశ్వరరావు
అశోక	: భగవంత్ కేసరి
ఊర్వశి	: టైగర్ నాగేశ్వరరావు
రంభ	: భగవంత్ కేసరి
మేనక	: లియో
అప్సర	: లియో
నామవరం	
వీఎస్ మహల్	: టైగర్ నాగేశ్వరరావు
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: భగవంత్ కేసరి, లియో
కడియం	
వెంకట సూర్య	: టైగర్ నాగేశ్వరరావు



దుళ్ల శారదా అమ్మవారి ఆలయం వద్ద సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు



అమ్మవారికి హారతి ఇస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో డాక్టర్ శ్రీనివాస్



మంగళవారపుపేటలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న చందన నాగేశ్వర్



దుళ్ల శారదా అమ్మవారి ఆలయం వద్ద కుంకుమ పూజలు

అపురూపం ఆ వైభవం



కడియపులంకలో అపర్ణాదేవికి నోట్లతో అలంకరణ



సరస్వతీఘాట్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు



ఉమామార్కండేయేశ్వరస్వామి ఆలయంలో..



వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ



మోరంపూడి సాయినగర్‌లో..

- సరస్వతిగా అమ్మవార్ల దర్శనం
- మూల నక్షత్రం సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- కిక్కిరిసిన ఆలయాలు, ఉత్సవ మండపాలు

సీటీఆర్ఐ: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు సరస్వతీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మూల నక్షత్రం, శుక్రవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. స్థానిక 48వ డివిజన్‌లోని మండపంలో జరిగిన సరస్వతీ దేవి పూజ, 3వ వార్డు సాయిబాబా గుడి వద్ద, జాంపేట శివాలయం వద్ద అమ్మవార్లను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్, ఎంపీ మార్గాని భరత్ రామ్ దర్శించుకున్నారు. సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులకు సామగ్రిని అందజేశారు. ఆయా ఉత్సవ నిర్వాహకులు ఎంపీ భరత్ రామ్‌ను సత్కరించారు. పార్టీ నగర కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, అజ్జరపు వాసు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

దేవీచౌక్‌లో రాజరాజేశ్వరిదేవిని సరస్వతీమాతగా అలంకరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని లిల్లీ పువ్వులు, చామంతులతో అలంకరించారు. సీతంపేట రామ మందిరంలోని మహాలక్ష్మీదేవి, విజయ కనక దుర్గాదేవి అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అమ్మవారు ధ్యాన సరస్వతి అవతారంలో దర్శనమిచ్చారు. 200 మంది చిన్నారులు సరస్వతీ పూజ చేశారు. అక్షరకోటి గాయత్రీ చక్రపీఠం, ఉమా రామలింగేశ్వర దేవాలయం, ఉమా కోటి లింగేశ్వర ఆలయం, సారంగధరేశ్వర దేవాలయం, శంకరమఠం, సరస్వతీ ఘాట్, శ్రీరామ బాలభక్త పుస్తక భాండాగారంలో అమ్మవారిని సరస్వతీగా అలంకరించారు.

అంగరంగా వైభవంగా..

రాజమహేంద్రవరం రూరల్: మంగళవారపుపేట చిన్న గాంధీబొమ్మ సమీపంలో బిల్డర్ చిన్న సమక్షంలో దుర్గా యూత్ కమిటీ ఆధ్వర్యంలో దేవీ నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని శుక్రవారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు. ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ సీఈవో స్వరాజ్యలక్ష్మి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి, బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని సరస్వతిగా అలంకరించారు.

కడియం మండలంలో..

కడియం: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయాల వద్ద విశేష కుంకుమ పూజలు జరిపించారు. కడియంలోని దేవీచౌక్, కడియపులంక అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయం, జేగురుపాడు దేవీచౌక్, దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా, పొట్టిలంక చింతాలమ్మ, మాధవరాయుడుపాలెం, కడియపుసావరం, దామిరెడ్డిపల్లిలోని విజయదుర్గ, మురమండ దేవీ, వీరవరం-కడియం రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయాలను భక్తులు భారీ ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కడియపులంక అపర్ణా అమ్మవారిని నోట్లతో అలంకరించారు. దుళ్ల మార్కెట్ సెంటర్‌లోని శారదా అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం రాత్రి 1200 మంది విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు పడాల ప్రసాద్ ఆధ్వర్యంలో వేద పండితులు మోహన్‌శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. అలాగే కడియపులంకలోని ముసలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన సరస్వతీ పూజలో భారీ ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 30వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సందర్భంగా శుక్రవారం వలంటీర్లను సత్కరించారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక, ఎస్సీ సెల్ చైర్మన్ కాటం రజనీ కాంత్ ఆధ్వర్యంలో గడప గడపకూ కార్యక్రమం జరిగింది. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అందుకే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ భవానీప్రియ, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, తగరం సురేష్, తాళాబత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముంపు నివారణకు శాశ్వత చర్యలు



కమిషనర్ దినేష్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని నగర పాలకసంస్థ కమిషనర్ దినేష్ కుమార్‌కు ఎంపీ మార్గాని భరత్ రామ్ సూచించారు. స్థానిక కోటిలింగాల పేట అంబేడ్కర్ విగ్రహం అడితి సమీపంలోని దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన సుమారు పదెకరాలకు పైగా ఉన్న స్థలాన్ని శుక్రవారం ఎంపీ, కమిషనర్ పరిశీలించారు. ఈ స్థలంలో ఆక్రమణలు తొలగించి డ్రైయినేజీ వాటర్ స్టోరేజీకి చెరువును నిర్మిస్తే ఎలా ఉంటుందనే విషయాన్ని చర్చించుకున్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ కంబాల చెరువు ఒకవైపు వర్షపు నీటిని మరో వైపు డ్రైయినేజీ వాటర్ స్టోరేజ్ తో ఉండేదన్నారు. అయితే ఆ ప్రాంత ప్రజల విజ్ఞప్తిపై కంబాల చెరువుకు వచ్చే డ్రైయినేజీలను పూర్తిగా క్లోజ్ చేసి ఆ చెరువును సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేశామన్నారు. లాలాచెరువు తదితర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే మురుగునీటిని మళ్లించడానికి నగర పాలక అధికారులు అనేక విధాలైన సర్వేలు చేస్తున్నారన్నారు. కోటిలింగాలపేట వద్ద దేవదాయ శాఖకు చెందిన స్థలాన్ని పరిశీలించామన్నారు. ఈ స్థలంలో నివాసం ఉంటున్న వారికి ప్రత్యామ్నాయం చూపిస్తే బాగుంటుందని ఎంపీ భరత్ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆర్ఎంసీ ఎస్ఈ పాండురంగారావు, సిటీ ప్లానర్ మూర్తి, టౌన్ సర్వేయర్ అనిత, పార్టీ నాయకులు గిరజాల బాబు, పోలు విజయలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి దుంగా మంగాలక్ష్మి, దుంగా సురేష్, అరిగెల బాబు, టీకే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జగన్ పాలనలో వైద్య విప్లవం



శాటిలైట్‌సిటీలో మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ పద్మలత



బుర్రిలంకలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న తాడాల చక్రవర్తి, ఊటుకూరి శైలజ

- ప్రజలందరికీ మెరుగైన వైద్యం
- వైద్యవిభాగం అధ్యక్షురాలు పద్మలత

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో వైద్య విప్లవం వచ్చిందని, పేదలందరికీ మెరుగైన వైద్యం అందుతోందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. శాటిలైట్ సిటీ సచివాలయం-4 పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు రొమ్ము క్యాన్సర్ రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముందుగా ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్, సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. 612 మందికి వైద్యసేవలు అందించగా, 20 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. పంచాయతీ కార్యదర్శి తాడి కృష్ణ, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ చైర్మన్ పాలిక శ్రీను, సచివాలయ కన్వీనర్లు ఎంవీవీ సత్యనారాయణ (దత్తసాయి), పగడాల లక్ష్మణరావు, కామిశెట్టి సుబ్రహ్మణ్యం (సుబ్బు) పాల్గొన్నారు. చందన చేయూత సంస్థ ఆధ్వర్యంలో రోగులకు భోజన సదుపాయం కల్పించారు.

593 మందికి వైద్య పరీక్షలు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి బుర్రిలంక సచివాలయం - 3 వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 593 మందికి వైద్య పరీక్షలు జరిపారు. డాక్టర్ ఎన్.జెస్సీ సుప్రియ, స్వరూప ఆధ్వర్యంలో ఇద్దరు జనరల్ ఫిజీషియన్లు, గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీలకు చెందిన స్పెషలిస్టు వైద్య బృందం పరీక్షలు చేపట్టింది. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే కళ్లజోళ్లు అందజేశారు. తహసీల్దార్ ఎం.సుజాత పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, ఇన్‌చార్జి సర్పంచ్ రాంజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్య సిబ్బంది సేవలందించారు.

23 నుంచి అయ్యప్ప భక్తులకు అన్నదానం

సీటీఆర్ఐ: స్థానిక గౌతమ ఘాట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి అయ్యప్ప భక్తులకు అన్నదానం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ ధర్మకర్తలు చల్లా శంకరరావు, పొలసానపల్లి హనుమంతరావు, మంతెన కేశవరాజు, తోట సుబ్బారావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చల్లా శంకరరావు మాట్లాడుతూ సంక్రాంతి వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు సంకల్పంతో 12 ఏళ్ల క్రితం ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం ఆయన ఆశయాల మేరకు కొనసాగుతోందన్నారు. గతేడాది 1.50 లక్షల మందికి భోజనం అందించామన్నారు. దాతలు విరివిగా సహకారం అందిస్తున్నారని, మంతెన కేశవరాజు ఏటా ఇస్తున్నట్టే ఈసారి కూడా రూ.లక్ష విరాళం ఇచ్చారన్నారు. పొలసానపల్లి హనుమంతరావు మాట్లాడుతూ అయ్యప్ప మాల ధరించిన వారికే కాకుండా భవాని, శివమాల ధరించిన భక్తులకూ భోజనం అందజేస్తామన్నారు. సమావేశంలో ఇమంది మోహనరావు, దవులూరి రామకృష్ణ, బండారు రామారావు, మన్నె సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఓల్డ్ విజయవాడ హోటల్, రౌండ్ పార్క్, ఎస్బీఐ, ప్రకాశం నగర్, లైఫ్ మెడికల్, జాగృతి బ్లడ్‌బ్యాంక్, మీసేవ, ఎస్‌డీవీ చానల్ ఏరియాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం మార్కండేయేశ్వరస్వామిగుడి ఎదురుగా గోదావరిలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు వన్‌టౌన్ ఏఎస్సై నాయుడు తెలిపారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లు ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ పి.పుల్లారావు 94407 96574 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లైఫ్ స్కిల్స్‌పై అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాధు జనరల్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు సాధు కోటేశ్వరరావు విద్యార్థులకు లైఫ్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ ఆకన రవిచంద్ర పుస్తక పఠనం చేయించారు. చిత్రలేఖనం నేర్పించారు. లైబ్రేరియన్ శ్రీదేవి పాల్గొన్నారు.

కాపవరంలో అమృత కలశ యాత్ర

మధురపూడి: నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండలం కాపవరంలో శుక్రవారం అమృత కలశయాత్ర జరిగింది. కాపవరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఈ యాత్ర నిర్వహించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టి, ధాన్యాన్ని కలశాలతో పట్టుకుని ర్యాలీ చేశారు. దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు అలరించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ మాట్లాడుతూ 22 గ్రామ పంచాయతీల నుంచి మట్టి, ధాన్యాన్ని సేకరించి కలశాల్లో భద్రపరిచామని, వీటిని దేశ రాజధాని ఢిల్లీకి పంపుతామన్నారు. అనంతరం ఎంపీపీ సూర్యకుమారితో పాటు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దివాన్ చెరువు పోస్టాఫీసు అప్‌గ్రేడ్



పోస్టాఫీసును ప్రారంభిస్తున్న దృశ్యం

రాజానగరం: దివాన్ చెరువు బ్రాంచ్ పోస్టాఫీసు అప్‌గ్రేడ్ అయ్యింది. సబ్ పోస్టాఫీసుగా మారింది. ఈ మేరకు కార్యాలయాన్ని శుక్రవారం తపాలా శాఖ రాజమహేంద్రవరం ప్రధాన కార్యాలయం సూపరింటిండెంట్ పి.కోమల్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోస్టాఫీసు నుంచి ఉత్తరాల బట్వాడా జరిగేదని, ఇక నుంచి దివాన్ చెరువు శాఖ నుండే నేరుగా ఉత్తరాల బట్వాడాతో పాటు నగదు లావాదేవీలూ జరుగుతాయన్నారు. సబ్ పోస్టుమాస్టర్ కె.బాబూరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం

ప్రకాశం నగర్: అమ్మఒడి సేవా తరంగిణి పుష్కర మహోత్సవం సందర్భంగా శుక్రవారం గౌతమ ఘాట్‌లోని రాధాగోపీనాథ మందిరంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ సలహాదారుడు జ్వాలాపురపు శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గుండె గుండెకు గోవిందుడు, గుడిసె గుడిసెకు గోవిందుడు అన్న సందేశంతో ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రారంభించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాదిలో 108 ఉచిత శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు విజయ్, కార్యదర్శి శివ, హిందూ చైతన్య వేదిక సభ్యులు పట్నాల సూరిబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వెల్డింగ్ పనిచేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతానికి చెందిన అంగాడ దుర్గారావు (42) మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. దుర్గారావు గురువారం రాజమహేంద్రవరం టేకువారివీధిలోని టేకు రాంబాబు ఇంటికి వెల్డింగ్ పనికి వెళ్లాడు. సాయంత్రం పనిచేసే సమయంలో విద్యుత్‌షాక్ తగిలి పడిపోయాడు. వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య సూర్యప్రభ ఫిర్యాదు మేరకు ఏఎస్సై చంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు.



సినిమా తర్వాత సినిమా... ఒకేసారి రెండు లేక మూడు సినిమాలు చేసే హీరోయిన్లు హఠాత్తుగా కొత్త సినిమా సైన్ చేయకపోతే? 'వాట్ నెక్ట్స్' అనే ప్రశ్న ఎదురవుతుంది. ఆ నాయికలు ఇతర భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ డైరీలో తెలుగు సినిమా లేకపోవడం ఫ్యాన్స్‌ని నిరుత్సాహ పరిచే విషయం. ప్రస్తుతం తెలుగులో సినిమా సైన్ చేయని నాయికల గురించి తెలుసుకుందాం.

● అనుష్క ● రకుల్ ● కృతీ శెట్టి ● సమంత

వాట్ నెక్ట్స్

గ్యాప్ లేకుండా...

అటు కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా, ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో ఆకట్టుకున్న అనుష్క జోరు గతంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిందనే చెప్పాలి. ఏడాదికి ఐదారు తెలుగు సినిమాలు చేసిన ఆమె ప్రస్తుతం ఏడాదికి ఒక్క సినిమాతోనే సరిపెట్టుకుంటున్నారు. 2021, 2022లో అయితే అనుష్క కనీసం ఒక్క తెలుగు సినిమాలోనూ నటించలేదు. ఈ ఏడాది నవీన్ పొలిశెట్టి, అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సెప్టెంబర్ 7న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇక నాన్‌స్టాప్‌గా సినిమాలు చేస్తానని, తెలుగులో గ్యాప్ లేకుండా ప్రాజెక్ట్స్ కమిట్ అవుతానని అన్నారు అనుష్క. ప్రస్తుతం 'కథనార్– ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. అయితే తెలుగులో కొత్త సినిమా ఏదీ సైన్ చేయలేదు.

సంవత్సరం విరామం

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న సమంత సంవత్సరం పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'మయోసైటిస్' వ్యాధి బారిన పడిన ఆమె కొన్నాళ్ల పాటు షూటింగ్స్‌కి దూరంగా ఉంటూ చికిత్స తీసుకుని సినిమాలు చేశారు. ఇక సమంత ఫుల్ స్పీడ్‌తో సినిమాలు చేస్తారని ఆశించిన ఆమె అభిమానుల ఆనందం ఆవిరి అయ్యేట్లు ఏడాది పాటు తాను సినిమాలకు గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించారు సమంత. మయోసైటిస్ పూర్తి స్థాయి చికిత్స కోసమే సమంత ఈ బ్రేక్ తీసుకున్నారనే వార్తలు వస్తున్నాయి. కాగా విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన 'ఖుషి' చిత్రం సెప్టెంబరు 1న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. 'ఖుషి' వంటి హిట్ మూవీ తర్వాత సమంత నటించనున్న తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఇకపోతే హిందీలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, 'చెన్నయ్ స్టోరీస్' (ఇంగ్లీష్–తమిళ్) చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

రెండేళ్ల గ్యాప్

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు రకుల్ ప్రీత్‌సింగ్. తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తా చాటిన ఈ బ్యూటీ రెండేళ్లుగా ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడం విశేషం. క్రిష్ దర్శకత్వం వహించిన 'కొండపొలం' చిత్రంలో నటించారు రకుల్. 2021 అక్టోబర్ 8న ఆ సినిమా విడుదలైంది. ఆ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు రకుల్. బాలీవుడ్‌కి పరిమితమై వరుసగా హిందీ సినిమాలు చేస్తున్నారామె. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'ఐ లవ్ యు', 'మేరీ పత్నీ కా రీమేక్' చిత్రాలతో పాటు తమిళంలో 'ఆయలాన్, ఇండియన్ 2' చిత్రాలు చేస్తున్నారు. అయితే రెండేళ్లుగా కనీసం ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడంతో ఆమె ఫ్యాన్స్ నిరుత్సాహపడుతున్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా ఈ బ్యూటీ తెలుగులో తన జోరు చూపిస్తారేమో చూడాలి.

కొత్త సినిమా ఎప్పుడు?

తెలుగు పరిశ్రమలోకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు కృతీ శెట్టి. తొలి సినిమా 'ఉప్పెన '(2021) తో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల మనసులను దోచారీ బ్యూటీ. గత ఏడాది (2022) కృతీ శెట్టి నటించిన 'బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమాలు రిలీజయ్యాయి. ఈ ఏడాది ఆమె నటించిన తెలుగు చిత్రం 'కస్టడీ' ఒక్కటే రిలీజ్ అయింది. ఆ చిత్రం విడుదలై ఆర్నెల్లు దాటినా మరో తెలుగు సినిమా సైన్ చేయలేదు కృతి. తెలుగులో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం మలయాళంలో 'అజయంతే రండం మోషణం', తమిళంలో 'జెనీ' సినిమాలు చేస్తున్నారు. మరి.. కృతీ డైరీలో కొత్త తెలుగు సినిమా చేరేది ఎప్పుడు?

ఈ ఏడాది 'దసరా, భోళా శంకర్' సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కీర్తీ సురేశ్. ఆ చిత్రాల తర్వాత మరో తెలుగు సినిమా అంగీకరించని కీర్తి తమిళంలో నాలుగు సినిమాలు చేస్తున్నారు. ఆమె నటించనున్న తదుపరి తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అదే విధంగా గత ఏడాది విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత మరో తెలుగు సినిమా ఒప్పుకోలేదు పూజా హెగ్డే. మహేశ్‌బాబు 'గుంటూరు కారం'లో హీరోయిన్‌గా ఎంపికైనా ఎందుకనో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారీ బ్యూటీ. అలాగే 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నభా నటేశ్ ఆ తర్వాత వరుసగా తెలుగు చిత్రాలు చేశారు. అయితే 'మాస్ట్రో' (2021) తర్వాత ఇప్పటివరకూ ఆమె మరో తెలుగు సినిమాపై ఎలాంటి సమాచారం లేదు. అదే విధంగా మెహరీన్, నిధీ అగర్వాల్, అనూ ఇమ్మాన్యుయేల్ వంటి హీరోయిన్ల జోరు కూడా తెలుగులో తగ్గింది. మెహరీన్ ఈ ఏడాది 'స్పార్క్' (తెలుగు–తమిళ్) లో నటిస్తున్నారు. ఆ తర్వాత ఆమె నటించే తెలుగు సినిమాపై క్లారిటీ లేదు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో రిలీజైన 'రావణాసుర' చిత్రం తర్వాత అనూ ఇమ్మాన్యుయేల్ ఏ తెలుగు సినిమాలోనూ నటించడం లేదు. అలాగే నిధీ అగర్వాల్ చేతిలోనూ 'హరి హర వీరమల్లు' మినహా మరో తెలుగు సినిమా లేదు. ఈ సినిమా ఎప్పుడో ఒప్పుకున్నారామె. అయితే షూటింగ్ ఆలస్యం అవుతోంది. ఈ చిత్రం తర్వాత వేరే ఏ తెలుగు సినిమా కూడా ఆమె కమిట్ కాలేదు.



● కీర్తీ సురేశ్ ● పూజా హెగ్డే ● నభా నటేశ్ ● నిధీ అగర్వాల్ ● మెహరీన్ ● అనూ ఇమ్మాన్యుయేల్



● అశోక్ వర్ధన్, సునీల్ బలుసు, విజయశాంతి, కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్, ప్రదీప్ చిలుకూరి

కొత్త సినిమా షురూ

కల్యాణ్ రామ్ హీరోగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నటి విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మురళీ మోహన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, విజయశాంతి క్లాప్ కొట్టారు. ముప్పా వెంకయ్య చౌదరి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ''భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న చిత్రమిది. కల్యాణ్ రామ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. త్వరలోనే ఇతర నటీనటులు, పూర్తి వివరాలను తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సి. రామ్ ప్రసాద్.

అనుకున్నవన్నీ జరగవు



● 'అల్లరి' నరేశ్, శ్రీరామ్

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన చిత్రం 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భరత్ ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన సందీప్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవడం ఆనందంగా ఉంది'' అన్నారు. జి. సందీప్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''నరేశ్‌గారు క్రైమ్, కామెడీ జానర్ చిత్రాలు ఎన్నో చేశారు. మా టైటిల్ లాంచ్ చేయడానికి ఆయనే కరెక్ట్ అనిపించింది'' అన్నారు శ్రీరామ్ నిమ్మల. ఈ చిత్రానికి కెమెరా: చిన్నా రామ్, జీవీ అజయ్, సంగీతం: గిడియన్ కట్ట, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీవీ నవీన్.

బేబి కాంబో రిపీట్



● ఆనంద్, వైష్ణవీ చైతన్య

'**బేబి**' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. 'బేబి' చిత్ర దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నంబూరి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే షూటింగ్ మొదలవుతుంది. వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని.

పీఎంఎంఎస్‌వై కింద చేపల యూనిట్లకు సబ్సిడీ



ఫిష్‌ఆంధ్రలాంజ్‌ను ప్రారంభిస్తున్న జ కలెక్టర్ డా.కె.మాధవీలత, చిత్రంలో కమిషనర్ కె.దినేష్‌కుమార్ తదితరులు



ఫిష్ ఆంధ్రా లాంజ్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వినియోగదారుల అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా ఆక్వా ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు అందుబాటులోనికి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర బ్రాండ్ ద్వారా డొమెస్టిక్ మార్కెటింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చిందని కలెక్టరు మాధవీలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జాంపేటలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా మంజూరైన(పీఎంఎంఎస్‌వై) యూనిట్–ఫిష్ ఆంధ్ర లాంజ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఈ పథకంలో రూ. 50 లక్షలతో ఫిష్ ఆంధ్ర లాంజ్ యూనిట్ స్థాపనకు 60 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీని అందిస్తాయన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీ ఫుడ్ ఇష్టపడే వారికి ఈ రెస్టారెంట్ అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రారంభోత్సవం అనంతరం మెనూలో గల వివిధ రకాల వంటకాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఏటా ఆక్వా ఉత్పత్తులు, సముద్ర మత్స్య సంపద ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. దేశం నుంచి విదేశాలకు ఎగుమతయ్యే ఆక్వా ఉత్పత్తుల్లో మనరాష్ట్రం నుంచి 30 శాతం వరకు ఉంటున్నాయన్నారు. అయినా ఏటాతలసరి చేపలు, రొయ్యలువినియోగం ఎనిమిది కిలోలుగా మాత్రమే ఉందన్నారు. ఇది దేశంలోని తలసరి వినియోగం కంటే తక్కువన్నారు. రాష్ట్రంలో వినియోగదారుల అవసరానికి అనుగుణంగా చేపలు.. రొయ్యల ఉత్పతులు అందుబాటులో లేకపోవడం ఇందుకు కారణమన్నారు.

అభిరుచికి అనుగుణంగా

వినియోగదారుల అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా ఆక్వా .. సముద్ర ఉత్పత్తులు అందుబాటులోనికి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర బ్రాండ్ ద్వారా డొమెస్టిక్ మార్కెటింగ్ విధానాన్ని అమలులోకి తెచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిష్ ఆంధ్ర చేపల విలువ ఆధారిత యూనిట్‌ను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రాజమహేంద్రవరంలో ఉమామహేశ్వరికి రూ.50 లక్షల విలువ గల యూనిట్ మంజూరైందన్నారు. ఇందులో 60 శాతం సబ్సిడీ ఉందని పేర్కొన్నారు. డొమెస్టిక్ మార్కెటింగ్ పెంపొందించడానికి, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం .. 60 శాతం సబ్సిడీపై యూనిట్లను మంజూరు చేస్తోందన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రమైన వాతావరణంలో సీ ఫుడ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయడం వల్ల చేపల ఆహార ప్రియులకు బాగా నచ్చుతుందన్నారు. అనంతరం ఫిష్ ఆంధ్ర లాంజ్ యూనిట్ కిచెన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి కృష్ణారావు, సహాయ సంచాలకులు షేక్. దిల్షాద్, సూపరింటెండెంట్ జయబాబు, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వినతులపై ప్రత్యేక దృష్టి సారించండి

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కృతికాశుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాల్‌లో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ ఎస్ ఇలక్కియా, డీఆర్‌ఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. భూ సమస్యలు, రెవెన్యూ సేవలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పెన్షన్ తదితర అంశాలపై 31 అర్జీలు స్వీకరించారు. వీటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతినెలా మూడో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సాయంత్రం ఉద్యోగుల గ్రీవెన్స్ కూడా నిర్వహించారు. ఉద్యోగుల జీతాలు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, క్రమశిక్షణ చర్యలు వంటి అంశాలపై 22 అర్జీలు స్వీకరించారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలకు రిజిస్ట్రేషన్

సీతానగరం: వచ్చే నెలలో జరిగే 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలకు అన్ని యాజమాన్యాల పాఠశాలలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కస్నూరి సతీష్‌బాబు శుక్రవారం ప్రకటనలో కోరారు. మీ పర్యావరణం వ్యవస్థను తెలుసుకో, ఆరోగ్యం పోషణ – సంక్షేమం పెంపొందించడం, పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక – సాంస్కృతిక ఆవిష్కరణ పద్ధతులు, స్వీయ విశ్వాసం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం, పర్యావరణ వ్యవస్థ – ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణ అనే విభాగాలలో ప్రాజెక్టులు తయారు చేసి తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా అకడమిక్ కో ఆర్డినేటర్ సుసత్య రేఖ, జిల్లా సైన్స్ ఆఫీసర్ నెప్రూ, జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ అంజనేయులు, అటల్ కో ఆర్డినేటర్ ఆనంద్‌బాబును సంప్రదించాలని సూచించారు. 90591 11210 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఆకట్టుకున్న తూర్పు నావికా దళ విన్యాసాలు

కాకినాడ రూరల్: టెర్రరిస్ట్ ఎటాక్, బాంబ్ స్క్వాడ్, మేజర్ ఫైర్, గ్యాస్ లీక్, ఆయిల్ స్పిల్, పేలుడు వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ తూర్పు నావల్ కమాండ్ ఆధ్వర్యంలో కాకినాడ ఆఫ్ షోర్‌లో రెండు రోజుల పాటు ఎక్సర్‌సైజ్ ప్రస్థాన్ – 2023 పేరుతో నిర్వహించిన నౌకాదళ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. భారత నౌకాదళం ఆఫ్‌షోర్ డెవలప్‌మెంట్ ఏరియా సెక్యూరిటీ కోసం కాకినాడ డీప్ సీలో ఓఎన్‌జీసీకి చెందిన రిగ్ షిప్ ప్లాటినం ఎక్స్‌ప్లోరరీ, ఆర్‌జీ ఫిక్స్‌డ్ ఆయిల్ ప్లాట్‌ఫాం ఆఫ్ వేదాంత లిమిటెడ్ వద్ద ఆకస్మిక పరిస్థితులు, ప్రతిస్పందనలను రిహార్సల్ చేశారు. ఓడీఏ వద్ద భద్రతా యంత్రాంగాల సామర్థ్యం తనిఖీ లక్ష్యంగా విన్యాసాలు జరిగాయి. ఈ విన్యాసాల్లో ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, ఆయిల్ ఆపరేటర్లు, పోర్ట్ అథారిటీలు, స్టేట్ ఫిషరీస్ డిపార్ట్‌మెంట్, మెరైన్ పోలీస్ వంటి సంస్థలు పాల్గొన్నాయి.



కాకినాడ ఆఫ్‌షోర్‌లో తూర్పు నావికాదళ విన్యాసం

విన్యాసాల్లో ఐఎన్‌ఎస్ కోరా, ఐఎన్‌ఎస్ తిహాయు, నాలుగు తక్షణ సహాయక నౌకలు, మెరైన్ కమాండోలు, పేలుడు ఆర్డీఎక్స్ డిస్పోజల్ టీమ్, హెలికాప్టర్లతో కూడిన భారతీయ నావికాదళం, ఐసీజీ షిప్ కనక్లతా బారువా పాల్గొన్నాయి.



బంగారు కల్పవృక్షం



బంగారు కామధేనువు

తుది మెరుగులు దిద్దుకుంటున్న బంగారు గంధపు గిన్నె



సత్యదేవుని సన్నిధిలో మరో కొత్త సేవ

- ప్రదక్షిణ దర్శన మార్గంలో కామధేనువు, కల్పవృక్షం, బంగారు హుండీ, గంధపు గిన్నె
- దాత సహకారంతో రూ.20లక్షలతో ఏర్పాటు
- దసరా నుంచి భక్తుల దర్శనానికి అనుమతి

అన్నవరం: ఈసారి దసరా సత్యదేవుని ఆలయంలో రెండు కొత్త సేవలకు శ్రీకారం చుట్టింది. మంచి ముత్యాలతో రూపొందించిన ముత్తంగి అలంకరణ సేవ ఈ నెల 16న ప్రారంభించగా విజయదశమి పర్వదినాన మరో విశిష్ట సేవ ప్రారంభం కానుంది. బంగారు కామధేనువు, బంగారు కల్పవృక్షం, బంగారు హుండీ, బంగారు గంధపు గిన్నెలను ఆలయ ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రదక్షిణ దర్శన మార్గంలో నాలుగు దిక్కులా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ప్రముఖ దాత, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణ రెడ్డి (పెదబాబు) రూ.25 లక్షల వ్యయంతో తండ్రి సుబ్బారెడ్డి పేరు మీద తయారు చేయించి సమర్పిస్తున్నాన్నారు. భక్తులు ప్రదక్షిణలో తొలుత వీటిని దర్శించనున్నారు. తర్వాత సత్యదేవుని దర్శించే అవకాశం కల్పించనున్నారు. సత్యదేవునికి అభిషేకం చేసిన గంధం ఈ గిన్నెలో వేస్తారు. భక్తులు వీటిని నుదుటిన దిద్దుకునే అవకాశం కల్పించనున్నారు.



అన్నవరం దేవస్థానం

రాగితో తయారు చేసి బంగారు పూత

రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ శిల్పులు కామధేనువు, కల్పవృక్షం, బంగారు హుండీ, గంధపు గిన్నెలను రూపొందిస్తున్నారు. స్వచ్ఛమైన రాగితో తయారు చేసి బంగారు పూత పూస్తున్నట్లు ఈఓ తెలిపారు. భక్తులు చేతులు వేసినా పాడవకుండా ప్లాస్టిక్ పేపర్‌తో లామినేషన్ చేయిస్తామన్నారు. ఇవి ఆదివారం నాటికి దేవస్థానానికి తీసుకువస్తామన్నారు. ప్రదక్షిణ మార్గంలో నైరుతి, ఈశాన్యం, వాయువ్య, ఆగ్నేయ మూలల్లో వీటిని ఏర్పాటు చేస్తారన్నారు.నిత్యం పండితులు పూజలు చేస్తారని తెలిపారు.



రాగితో తయారు చేసిన హుండీ, దీనికి బంగారు పూత పూస్తారు

ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది



దేవతలు రాక్షసులు పాలసముద్రాన్ని చిలికినప్పుడు అమృతంతో పాటు ఉద్భవించినవి కామధేనువు, కల్పవృక్షం, మహాలక్ష్మి, గంధపుచెట్టు. ఇవి ఎక్కడుంటే అక్కడ సిరి సంపదలకు లోటుండదు. అందువలన వీటిని సత్యదేవుని ఆలయంలో ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు వీటిని సందర్శించడం ద్వారా సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది. మహాలక్ష్మికి ప్రతిరూపంగా బంగారు హుండీ, గంధపు చెట్టుకు ప్రతిరూపంగా గంధపు గిన్నెను ఏర్పాటు చేస్తున్నాం. గిన్నెలో గంధాన్ని భక్తులు నుదుటిన అద్దుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఆకర్షణీయంగా కనిపించేలా వాటి పైభాగంలో రంగు రంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించాం.

చంద్రశేఖర్ అజాద్..ఈఓ

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బాలిక వైద్యానికి రూ.8 లక్షల చెక్కు అందజేత

మధురపూడి: పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. అరుదైన హెచ్‌ఎల్‌హెచ్ (రక్తకణాలకు సంబంధించి) వ్యాధితో బాధపడుతున్న తొమ్మిదేళ్ల రెజీన ఇవాంజిలిన్ అనే బాలిక వైద్యం కోసం శుక్రవారం రూ.8 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు మేలో ఆ బాలికకు తక్షణ సాయంగా రూ.లక్ష ఇచ్చారు. ఇప్పుడు ఇచ్చిన చెక్కుతో కలిసి ఆమెకు రూ.9 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన వల్లూరి చినబాబు కుమార్తె రెజీనా ఇవాంజిలిన్ అరుదైన హెచ్‌ఎల్‌హెచ్ వ్యాధితో బాధపడుతోంది. రెక్కల కష్టంపై ఆధారపడిన తండ్రి వీరబాబు 2019లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో బాలికను చూపించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు విజయవాడ రైన్‌బో హాస్పిటల్లో వైద్యం చేయించారు. కానీ నయం కాకపోవడంతో వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి ఎంతో డబ్బు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో గాదరాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను బాలిక తండ్రి కలిసి సమస్యను తెలిపారు. రాజా వెంటనే స్పందించి వారికి భరోసా ఇచ్చారు. మే 24న కొవ్వూరులో సభకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఆయన వెంటనే తక్షణ సాయంగా రూ. లక్ష మంజూరు చేశారు. కాగా.. మండలం దివాన్ చెరువులో ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాజా శుక్రవారం ఆ బాలికకు మంజూరైన రూ.8 లక్షల చెక్కును తల్లిదండ్రులకు అందించారు. అలాగే ప్రతినెలా రూ.10 వేల డీఎంహెచ్‌ఓ పింఛన్ వచ్చేలా కృషి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గాదరాడ నాయకులు అరిబోలు చినబాబు, గొల్లపల్లి అశోక్, కవలపల్లి శివ, చీర్ల శివ, కండికట్ల రాజశేఖర్ పాల్గొన్నారు.



దివాన్‌చెరువులో బాలిక కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

న్యూస్‌మేకర్

కశ్మీర్ పేరు చెప్తే అందమైన ప్రదేశాలే గుర్తొస్తాయి.
కాని ఆ లోయలో దాగిన రుచులు
అన్వేషిస్తే తప్ప తెలియదు.
శాకాహారమైనా మాంసాహారమైనా
స్వచ్ఛమైన దినుసులతో గుమ్మెత్తిస్తారు.
'మేము ఎలా వండుతామో నా వంట చూసి
తెలుసుకోండి' అని
కశ్మీర్ వంట చేసి చూపుతోంది రుక్సార్ సయీద్.
కశ్మీర్ మహిళలు పెద్దగా పాల్గొనని
'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' తాజా సిరీస్‌కు
రుక్సార్ స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది.
పోటీని తట్టుకుని టాప్ 12లో నిలిచిన ఆమెను చూసి
కశ్మీర్‌లో ఆడవాళ్లు గర్విస్తున్నారు.


రుక్సార్ సయీద్

టేస్ట్ ఆఫ్ కశ్మీర్

సోనీ లివ్‌లో ప్రసారమవుతున్న తాజా సీజన్ 'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' కోసం రుక్సార్ సయీద్ (33) 'షబ్ దేగ్' అనే కశ్మీరీ వంట చేసింది. 'ఇది మా అమ్మమ్మ నుంచి మా అమ్మకు, మా అమ్మ నుంచి నాకు అందిన వంట. ముదురు గుమ్మడికాయ, నాటుకోడి, ఆల్ బకారా ఎండుగుజ్జు వేసి చేస్తాం. చాలా బాగుంటుంది' అంది. జడ్జీలుగా ఉన్న ప్రముఖ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, పూజా ధింగ్రా... కొద్దిగా రుచి చూసి 'అద్భుతం' అన్నారు. ఆమె ఇంకో ఎపిసోడ్‌లో 'షికారా రైడ్' అనే అల్పాహారం చేసింది. మటన్ కోఫ్తాను, పుదీనా మసాలాతో రంగరించి చేసింది. టేస్ట్ అదిరిందని వేరే చెప్పాలా?

'కశ్మీర్ లోయంతా రకరకాల మసాలా దినుసులు, మేం మాత్రమే తినే ఆకుకూరలు, కాయగూరలు ఉన్నాయి. వాటిని వండే పద్ధతి అందరికీ తెలియదు. మాస్టర్ షెఫ్ ద్వారా దేశమంతటికీ ఆ రుచులను తెలియజేయాలనుకుంటున్నాను' అంటుంది రుక్సార్ సయీద్.

ఆమె సంకల్పం గట్టిదిలాగుంది. తాజా సీజన్‌లో మహా మహా వంటగాళ్లు, వంటగత్తెలు పోటీ పడితే తుది జాబితాలో 22 మంది ఉంటే, వారిలో చాలామందిని అధిగ'మించి' టాప్ 12కు చేరింది రుక్సార్. దాంతో కశ్మీర్‌లో ఇప్పుడు ఈ షోను అక్కడి స్త్రీలు చూస్తున్నారు. రుక్సార్‌ను తమ ప్రతినిధిగా, తమ సామర్థ్యాలకు కొలమానంగా చూస్తున్నారు. 'ఆ సంతోషం చాలు నాకు. నన్ను స్ఫూర్తిగా తీసుకుని స్త్రీలు ముందుకు రావాలి' అంటుంది రుక్సార్.



ఫుడ్ టెక్నాలజీలో డాక్టరేట్

రుక్సార్ సయీద్‌ది పుల్వామా జిల్లాలోని పామ్‌పోర్ అనే ప్రాంతం. నిత్యం మంచు కురిసే ఈ ప్రాంతంలో కవులు ఎక్కువ. 'నేను కవిత్వం రాయను. కాని ప్లేట్‌లో పదార్థమే ఒక కవిత్వమంత అందంగా అమర్చగలను' అంటుంది రుక్సార్. ఫుడ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన రుక్సార్ అందరిలా ఏ లెక్చరర్ పోస్ట్‌కో వెళ్లలేదు. 'నాకు ఆహారం మీద సంపూర్ణ అవగాహన ఉంది. ముఖ్యంగా ఫ్రోజెన్ ఫుడ్‌ను సరిగా అమ్మగలిగితే తక్షణం వేడి చేసుకుని తినాలనుకునేవారికి మేలు జరుగుతుంది. కాని ఆహారంలో కల్తీ ఎక్కువ. ఈ కల్తీ విషంతో సమానం. అందుకే నేను ఏ కల్తీ లేని ఫ్రోజెన్ ఫుడ్‌ను అమ్మాలని ఖాలిస్ ఫుడ్స్ పేరుతో చిన్న సంస్థను మొదలుపెట్టాను. చికెన్ ఉత్పత్తులను కశ్మీర్‌లో అమ్ముతున్నాను. కశ్మీర్‌లో ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించడమే ఎక్కువ అవసరం అని నేను భావిస్తాను. నిరుద్యోగం పోవాలంటే ఇలాగే చేయాలి. నా సంస్థ బాగా నడుస్తోంది. కాని దేశవ్యాప్తంగా పంపాలంటే కొన్ని చిక్కులు ఉన్నాయి. ఈ లోపు నేను, నా బ్రాండ్ తెలియడానికి మాస్టర్ షెఫ్ ప్రోగ్రామ్‌కు వచ్చాను' అని తెలిపింది రుక్సార్.

అంతే తేడా

'వంట అందరు ఆడవాళ్లూ చేస్తారు. కాని ఫుడ్ షోలలో ఆ వంటను శాస్త్రీయంగా చేయాలి. అంతే తేడా. కశ్మీర్‌లో వంట తెలిసిన యువతీ యువకులు బాగానే ఉన్నారు. నేను ఈ షో ద్వారా గడించిన అనుభవంతో వారికి సాయం చేయాలనుకుంటున్నాను. ఆహారం తయారు చేయడంలో మెళకువలు తెలిపి వారు ఫుడ్ జాయింట్‌లు ఏర్పాటు చేసుకుని తమ కాళ్ల మీద తాము నిలబడేలా చూడాలనుకుంటున్నాను. ఇందుకు కావాల్సిన సామాగ్రి నేనే సమకూరుస్తాను' అంది. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్న రుక్సార్ తన భర్త సాదిక్ అహ్మద్ సహకారం వల్లే ఇలా షోకు వచ్చినట్టుగా తెలిపింది. 'ఆడవాళ్లూ.. ప్రయత్నించండి. ఓడిపోవద్దు' అనేది రుక్సార్ సందేశం.

ప్రమాదమా..? టాన్యా ఉందిగా..!



కాస్త ఖాళీ సమయం దొరికినప్పుడు... సెలవుల్లో స్నేహితులతో కలసి ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు చాలామంది యువతీ యువకులు. అయితే అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే వారిని ఎవరు కాపాడతారు? అందుకే అలాంటి వారికి అండగా ఉంటోంది టాన్యా. అవును, సరదాగా గడపాల్సిన వయసులో ఇతరుల ప్రాణాలను రక్షిస్తోంది టాన్యా కోలి. ఐదోఏటి నుంచే కొండలు ఎక్కడం నేర్చుకుని, టీనేజ్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏకంగా రెస్క్యూ టీమ్‌ను నిర్వహిస్తూ ఎంతోమందిని ఆపదల నుంచి బయటపడేసింది. పెద్ద పెద్ద కొండలను అవలీలగా ఎక్కేస్తూ, మరొకరికి సాయంగా నిలబడుతూ.. నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది టాన్యా.

నాసిక్‌కు చెందిన టాన్యా కోలి ఐదేళ్ల వయసు నుంచే పర్వతాలు ఎక్కడం నేర్చుకోవడం మొదలు పెట్టింది. టాన్యా తండ్రి దయానంద్ కోలి నాసిక్ క్లైంబర్స్ అండ్ రెస్క్యూయర్స్ అసోసియేషన్‌లో పని చేస్తుండడంతో తరచూ ట్రెక్కింగ్, రెస్క్యూ అనే పదాలను తండ్రి నోట వెంట వినేది. టాన్యాకూ ట్రెక్కింగ్ పైన ఆసక్తి ఏర్పడడంతో తండ్రి దగ్గర ట్రెక్కింగ్ ఎలా చేయాలో నేర్చుకుంది. అలా ట్రెక్కర్‌గా మారిన టాన్యా, రెస్క్యూటీమ్ కలిసి ఎంతోమందిని ప్రమాదాల నుంచి బయటపడేస్తోంది. తండ్రి దగ్గర నేర్చుకున్న ట్రెక్కింగ్ మెళకువలతోపాటు, హిమాలయాల్లో ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడడంతోపాటు, పర్వతారోహకులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తోంది టాన్యా. పర్వతాన్ని అధిరోహించేటప్పుడు జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో కూడా నేర్పిస్తుంది. టాన్యా దగ్గర శిక్షణ తీసుకుంటున్నవారిలో మహారాష్ట్ర పోలీసు అకాడమీ ట్రైనీలు కూడా ఉన్నారు. ప్రతిసారీ తను అందుబాటులో ఉండడం కష్టం కాబట్టి ఇతరులకు నేర్పించడం ద్వారా ప్రమాద సమయంలో వారిని వారే కాపాడుకోవడంతోపాటు, ఇతరులను కూడా కాపాడగలరు. అందుకే మరింతమందికి రెస్క్యూలో శిక్షణ ఇస్తున్నాను అని టాన్యా చెబుతోంది.

''ప్రమాదంలో ఉన్నారు, కాపాడాలి అని సమాచారం తెలిస్తే వెంటనే బయలుదేరతాం. అది అర్ధరాత్రి అయినా ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో సిద్ధంగా ఉంటాం. ట్రెకింగ్ చేసేవారిని, ప్రమాదంలో ఉన్న వ్యక్తుల్ని రక్షించడం థ్రిల్లింగ్ ఇచ్చేదే అయినప్పటికీ చాలా సవాళ్లతో కూడుకున్నది. సమస్యలు ఉన్నప్పటికీ అవతలి వారిని ప్రమాదం నుంచి కాపాడగలిగామన్న సంతృప్తి ముందు ఆ సమస్యలు, సవాళ్లు చిన్నబోవలసిందే'' అని చెబుతోంది తాన్యా.

● సందర్భం

ఆమె సక్సెస్ మంత్రా...

వ్యూహ చతురత వృత్తి నిబద్ధత


ఇప్సితా దాస్‌గుప్తా

అనుభవం నేర్పిన పాఠాలు అద్భుత విజయాలను సొంతం చేస్తాయి. రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో కార్పొరేట్ కంపెనీలలో పని చేసిన ఈప్సితా దాస్‌గుప్తా ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకుంది. అమెరికాలో యాపిల్ సర్వీసెస్‌లో సీనియర్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకుంది. తాజాగా... అమెరికన్ మల్టీ నేషనల్ ఐటీ కార్పొరేషన్ 'హెచ్‌పీ ఇండియా' సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్‌వీపీ), మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం అయింది...

పనిలోని కష్టమే ఇష్టమైతే అంతకంటే సుఖం ఏమున్నది?

కొలంబియా యూనివర్శిటీలో మ్యాథ్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసిన ఈప్సితా ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలలో పనిచేసింది. ముంబై రోడ్లపై ఉరుకులు, పరుగులు, పని భారంతో నిద్రలేని రాత్రులు ఆమెకు కొత్తేమీ కాదు.

కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోడంలో సమస్యలు తలెత్తాయి.

'నాకు కష్టంగా ఉంది' అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

ఎన్నో కంపెనీలలో మార్కెటింగ్, స్ట్రాటజీ విభాగాలకు నేతృత్వం వహించి మన దేశంతో సహా బంగ్లాదేశ్, శ్రీలంకలలో పనిచేసింది ఈప్సితా. ఆఫీస్ గదికే పరిమితం కాకుండా జనాల్లోకి వెళ్లి క్లయింట్స్ అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేది. వాటికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకునేది.

యాపిల్‌కు ముందు స్టార్ ఇండియా ప్రెసిడెంట్ అఫ్ కార్పొరేట్ స్ట్రాటజీ, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ దక్షిణ ఆసియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేసిన ఈప్సితా వృత్తికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరితో చర్చిస్తుంది.

'తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవచ్చునేమోగానీ, ఆ నిర్ణయం ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను వెనక్కి తీసుకోలేదు. అందుకే ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద కోణాల్లో ఆలోచిస్తాను' అంటుంది ఈప్సితా.

'మీకు ఇన్‌స్పిరేషన్ ఎవరు?' అనే ప్రశ్నకు ఈప్సితా చెప్పే జవాబు...
'వీరు వారు అని కాదు. నేను మాట్లాడే ప్రతి వ్యక్తి నుంచి ఎంతో కొంత ఇన్‌స్పైర్ అవుతుంటాను. సాధారణ ప్రజల నుంచి ఇన్వెస్టర్‌లు, లీడర్‌లు, ఆర్టిస్టుల వరకు నాకు ఎంతోమంది రోల్ మోడల్స్ కనిపిస్తారు'

ఉద్యోగంలోకి అప్పుడే వచ్చిన రోజుల్లో ఈప్సితాలాంటి కొత్త ఉద్యోగులకు సీనియర్‌ల నుంచి వినిపించిన మాట 'ఇలా ఎవరైనా ఆలోచిస్తారా?'

అందరిలాగే ఈప్సితా ఆలోచించినట్లయితే ఆమెకు ఇంత పేరు వచ్చేది కాదేమో.

'ఇలా కూడా చేయవచ్చు... అంటూ సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఆలోచించేదాన్ని. ఇది సీనియర్‌లకు రుచించేది కాదు. అయితే నా ఆలోచనల్లో సత్తా ఉందని ఆ తరువాత నిరూపణ అయింది' అంటుంది ఈప్సితా.

వృత్తిరీత్యా ఈప్సితా దాస్‌గుప్తా ఒక సమస్యకు పరిష్కారం వెదకగానే పని అక్కడితో ఆగిపోదు. 'మేమున్నాం' అంటూ కొత్త సమస్యలు పుట్టుకొస్తుంటాయి. గత సమస్యలతో వీటికి పోలిక ఉండకపోవచ్చు. కొన్నిసార్లు పరిష్కారం దుర్భేద్యంగా అనిపించవచ్చు. ఇలాంటి సమయంలోనే వ్యూహకర్తలు చురుగ్గా ఆలోచించాలి.

వ్యూహకర్తగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఈప్సితా దాస్‌గుప్తా ఎంతోమందికి రోల్ మోడల్‌గా నిలిచింది.

బ్యూటిప్స్

కనుబొమలకు కలోంజీ





నల్లజీలకర్ర (కలోంజీ) విత్తనాలను పొడిచేయాలి. ఈ పొడిలో ఆలివ్ ఆయిల్, అలోవెరా జెల్‌ను వేసి చక్కగా కలపాలి. ఇప్పుడు తడి కాటన్ వస్త్రంతో కనుబొమలను శుభ్రంగా తుడిచి.. నల్ల జీలకర్ర మిశ్రమాన్ని ప్యాక్‌లా వేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. కనుబొమ్మలను తడిలేకుండా తుడిచి కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను కనుబొమలపైన రాసి ఐదునిమిషాలపాటు మర్దన చేయాలి.

- ఈ ప్యాక్‌ను వారానికి మూడుసార్లు వేయడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి కనుబొమల మీద వెంట్రుకలు పెరుగుతాయి.
- నల్లజీలకర్ర ప్యాక్ పలుచటి కనుబొమలను ఒత్తుగా మారుస్తుంది. కనుబొమలు తీరైన ఆకృతిలో చక్కగా మెరుస్తాయి.
- కలోంజిలోని పోషకాలు కనుబొమల వెంట్రుకలు రాలకుండా చేస్తాయి.
- కనుబొమలు తెల్లబడడం మొదలైన వారు సైతం ఈ ప్యాక్‌ను వాడితే వెంట్రుకలు నల్లగా మారతాయి.


డాక్టర్ మురళీకృష్ణ

నేను జయించాను

వైద్యులు రోగులకు వైద్యం చేస్తారు. పేషెంట్ వ్యాధిని అంచనా వేసి, పరీక్షలతో నిర్ధారణకు వచ్చి, సిలబస్‌లో చదివిన సమాధానాలతో వైద్యం చేస్తారు. మరి... అప్పటివరకు లేని కొత్త రోగం వస్తే? చికిత్స కోసం అప్పటికే చదివిన సిలబస్‌లో సమాధానం ఎలా వెతకాలి? వైద్యవిద్యలో చెప్పని పాఠాల కోసం అన్వేషణ ఎలా మొదలు పెట్టాలి? అందుకే... 'పేషెంట్‌లు, పరిశోధనలే నా గురువులు' అన్నారు డాక్టర్ మురళీకృష్ణ. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... నిర్ధారిత ప్రయోగాలు, నిరూపిత సమీకరణలతో వైద్యం చేయడానికే పరిమితం కాకూడదు. రోగికి అవసరమైన కొత్త సమీకరణాలను వైద్యులు సృష్టించగలగాలన్నారు. బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ విశేషంగా వైద్యసేవలందించిన వైద్యులను ఇటీవల న్యూఢిల్లీలో గౌరవించింది. పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ 'హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023' పురస్కారం అందుకున్నారు తెలుగు డాక్టర్ మురళీకృష్ణ.

మైక్రో బయాలజీ నడిపించింది!

''మాది అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రాపురం. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్, అదే కాలేజ్‌లో ఎం.డీ (మైక్రో బయాలజీ) కూడా చేసి, సాంక్రమిక వ్యాధుల నిపుణుడిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. మైక్రో బయాలజీలో చేరడం ఇష్టంతో కాదని చెప్పడానికి ఏ మాత్రం మొహమాట పడను. సీటు వచ్చిన కోర్సుతో రాజీపడిపోయాను. కానీ కోర్సు మొదలైన తర్వాత ఏర్పడిన ఆసక్తిని మాటల్లో వర్ణించలేను. నేరుగా వైద్యం చేయడం కంటే వైద్యరంగానికి అవసరమైన తెర వెనుక కృషి చాలా సంతృప్తినిచ్చింది. గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్థులకు పరీక్షల కోసం సేకరించిన రక్త నమూనాలను తీసుకుని ఎయిడ్స్ వైరస్ గురించి ప్రభుత్వం చాలా గోప్యంగా పరీక్షలు నిర్వహించేది. మనదేశంలో వెయ్యిలో 15 మందిలో ఎయిడ్స్ వైరస్ ఉన్నట్లు, అది దక్షిణాది ఆఫ్రికా దేశాల నుంచి మనదేశంలోకి వస్తున్నట్లు తెలుసుకున్నాం. దేశంలో ప్రభుత్వ సంస్థల దగ్గర ఉన్న సమాచారమంతటినీ సేకరించాను. అన్ని సంస్థల దగ్గరున్న సమాచారం కంటే ఎక్కువ డాటా నా దగ్గరుంది. అప్పట్లో మనదగ్గర ఎయిడ్స్‌కి వైద్యం చేసే డాక్టర్‌లు లేరు. అనుబంధ సమస్యలకు వైద్యం చేసే నిపుణులే హెచ్‌ఐవీకి కూడా మందులిచ్చేవారు. ఆ ఖాళీని భర్తీ చేయాలనుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి హెచ్‌ఐవీ ఫిజీషియన్‌ని నేనే.

వారానికి ఇద్దరు పేషెంట్‌లు!

సొంత ప్రాక్టీస్ మొదలుపెట్టింది 2000లో. మొదట్లో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు పేషెంట్‌లు వచ్చేవారు. దాంతో నా సమయాన్ని ఎయిడ్స్ అధ్యయనానికి ఉపయోగించాను. ప్రముఖ పరిశోధకులందరూ శాస్త్రం ఆధారంగా ఎయిడ్స్‌కు వైద్య శోధన మొదలు పెట్టారు. నా అధ్యయనం, పరిశోధనలను పేషెంట్ వైపు నుంచి మొదలు పెట్టాను. ఎయిడ్స్‌కి మాంటూక్స్ టెస్ట్ అలాంటిదే. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వ్యాధినిరోధక శక్తిని కోల్పోయి టీబీ సోకడం సర్వసాధారణంగా జరిగేది. ఎయిడ్స్ మరణాల్లో ఎక్కువ టీబీ మరణాలే ఉండేవి. '13వ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాన్ఫరెన్స్' సౌత్ ఆఫ్రికాలోని దర్బన్‌లో జరిగింది. ఆ సదస్సులో నేను 'మాంటూక్స్ టెస్ట్' ఎయిడ్స్ తీవ్రత పట్ల ఒక అంచనాకు రావచ్చని చెప్తూ నా పరిశోధన పత్రాన్ని సమర్పించాను. అది ఎయిడ్స్ చికిత్సలో కొత్త దృక్పథానికి దారి తీసింది. ఎయిడ్స్ చికిత్సలో వైద్యం మొదలు పెట్టిన వారం రోజుల నుంచి రికవరీ స్పష్టంగా తెలుస్తుంది. అయితే జీవితకాలం మందులు వాడాల్సిందే. పేషెంట్ తిరిగి తన పనులకు వెళ్లగలిగేటట్లు చేయడం నా వైద్యం ఉద్దేశం. ఈ వ్యాధి పేద వాళ్లలోనే ఎక్కువ. వారికి వైద్యం చేయడంలో టెస్ట్‌ల మీద ఆధారపడకుండా వ్యాధి లక్షణాలు, చిహ్నాలను బట్టి తీవ్రతను అంచనా వేసి చికిత్స చేస్తాను. అలాగే రెండంచెల ఔషధాలతో వైద్యం చేయడం కూడా నేను చేసిన మరో ప్రయోగం. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ సింపోజియమ్ హెచ్‌ఐవీ ఎమర్జింగ్ మెడిసిన్' సదస్సులో పేపర్ సమర్పించాను. నేను ప్రతిపాదించిన పదేళ్ల తర్వాత 2019 నుంచి ఇప్పుడు అంతర్జాతీయంగా టూ డ్రగ్స్ చికిత్సనే అనుసరిస్తున్నారు.



'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ 2023' అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

కోవిడ్‌కి ఇంట్లోనే వైద్యం

కోవిడ్ వైద్యరంగానికి పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఒక వ్యాధికి మందులు రావాలంటే దశాబ్దాల పరిశోధన తర్వాత మాత్రమే సాధ్యం. కొత్త వ్యాధి, పైగా ఒక్కసారిగా విజృంభించినప్పుడు రోగులందరికీ ఒకేసారి నాణ్యమైన వైద్యం అందించడం ఎవరికీ సాధ్యం కాదు. వ్యాధి విస్తరించినంత వేగంగా ప్రత్యామ్నాయాల అన్వేషణ కూడా జరగాలన్న ఆలోచనతో సులభంగా, చవగ్గా దొరికే మందులతో హోమ్‌కేర్ కిట్ రూపొందించాను. కోవిడ్ మీద అవగాహన కోసం వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒక్కో పోస్ట్ వేలసార్లు షేర్ అయింది. వైద్యం కోసం పేషెంట్‌లు అప్పుల పాలు కాకూడదనేది నా పాలసీ. అందుకోసమే నా తాపత్రయమంతా. కోవిడ్ మీద కూడా అవగాహన పుస్తకం తెచ్చాను. కోవిడ్ తర్వాత వస్తున్న సమస్యల మీద అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. నాలుగు ఇంటర్నేషనల్ సెమినార్‌లలో పేపర్‌లు ప్రెజెంట్ చేశాను. ఇంకా చేస్తాను కూడా. ఒక డాక్టర్‌గా వైద్యరంగం నేర్పించిన జ్ఞానంతో పేషెంట్‌లను ఆరోగ్యవంతులను చేయడానికి కృషి చేయడం అనేది నూటికి తొంభై తొమ్మిది మంది చేసే పని. నా కృషితో వైద్యరంగానికి తోడ్పాటు అందించడం నా విజయం. మొదట ఆరోగ్యపరంగా నన్ను నేను జయించాను. ఆ తర్వాత జీవితాన్ని జయించాను. మా ఇంట్లో తొలి వైద్యుడిని నేనే. నా పిల్లలిద్దరిలో ఎవరూ వైద్యరంగం పట్ల ఆసక్తి చూపకపోవడమే మనసుకు బాధ కలిగించే విషయం'' అన్నారు ప్రజారోగ్య పరిరక్షణలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ మురళీకృష్ణ.


– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎయిడ్స్ అవగాహన వ్యాసాలు

హెచ్‌ఐవీ గురించి మన సమాజంలో విపరీతమైన భయం రాజ్యమేలుతున్న రోజులవి. ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం నగరాలు, పట్టణాలు, చిన్న కాలనీలు, గ్రామాల్లో ఐదు వందలకు పైగా సమావేశాల్లో ప్రసంగించాను. వయోజనుల్లో అవగాహన కోసం 'అక్షర గోదావరి' పేరుతో క్లుప్తంగా, సరళంగా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రాశాను. మొదట మా జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును తర్వాత అన్ని జిల్లాలకూ విస్తరించారు. ఆశ వర్కర్స్, రీసోర్స్ పర్సన్స్‌కి ప్రామాణిక గ్రంథంగా నా రచననే తీసుకున్నారు. హెచ్‌ఐవీ గురించిన అవగాహన వ్యాసాలతో 'ఎయిడ్స్' పేరుతో పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకం పునర్ముద్రణలతో పదేళ్లలో ఎనిమిది వేల కాపీలు అమ్ముడవుతుందని నేను కూడా ఊహించలేదు. ఎంబీబీఎస్‌లో కాలేజ్ మ్యాగజైన్‌కి ఎడిటర్‌గా పని చేసిన అనుభవమే ఇప్పటికీ నా అధ్యయనాలన్నింటినీ అక్షరబద్ధం చేయిస్తోంది.

– డాక్టర్ యనమదల మురళీకృష్ణ, ఎం.డి., కాకినాడ, ఆంధ్రప్రదేశ్

ఇండస్ట్రీ 4 స్టార్టప్స్‌కు 'కల్పతరువు' విశాఖ



- దేశంలో తొలి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కల్పతరువు
- తొలి దశలో 5 స్టార్టప్స్ ఏర్పాటు
- రెండో దశలో మరో 16 ఏర్పాటుకు రంగం సిద్ధం
- 13 సంస్థలు స్టీల్‌ప్లాంట్ సమస్యలపై పరిశోధనలు
- సాధారణ సమస్యలపై వినూత్న ఆవిష్కరణలకు సిద్ధంగా 8 స్టార్టప్‌లు
- ఆవిష్కరణలను మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరణ
- తాజాగా హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం
- ఎన్‌టీపీసీ, ఐవోసీఎల్ వంటి సంస్థలతో చర్చలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలు (కంపెనీ విలువ బిలియన్ డాలర్లకు చేరడం)గా ఎదగాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పానికి విశాఖ కేంద్రంగా మారుతోంది. పారిశ్రామిక రంగంలో నాలుగో తరం సాంకేతిక విప్లవంగా పేర్కొంటున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), రోబోటిక్, ఆటోమేషన్, బిగ్ డేటా వంటి టెక్నాలజీల్లో నూతన ఆవిష్కరణలకు కేంద్ర స్థానమవుతోంది. విశాఖపట్నంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ 'కల్పతరువు'లో ఈ నూతన ఆవిష్కరణలపై పలు స్టార్టప్స్ సంస్థలు జోరుగా పరిశోధనలు సాగిస్తున్నాయి.

ఇండస్ట్రీ 4 ఆవిష్కరణలను ప్రోత్సహించేలా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్ఎల్) సంయుక్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో కల్పతరువు పేరిట సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని రూ. 20 కోట్లతో ఏర్పాటు చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వేడి ఉక్కు ద్రావణం ప్రవహించే చోట్ల, అధిక వేడి ఉండే కొలిమిల వద్ద మనుషులు పనిచేయడం చాలా కష్టం. ప్రమాదాలు జరిగే అవకాశాలూ ఎక్కువ. ఇలాంటి చోట మానవరహితంగా పూర్తి ఆటోమేటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసేలా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కల్పతరువు ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా ఆర్‌ఐఎన్ఎల్ ఉక్కు తయారీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాన్ని చూపేలా పరిశోధనలు చేయడానికి ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్స్‌ను ప్రకటిస్తూ ఉంటుంది. ఇలా ఆర్‌ఐఎన్ఎల్ ఇచ్చిన సమస్యలపై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలను కనుక్కోవడానికి అనేక స్టార్టప్ సంస్థలు విశాఖ కల్పతరువును వేదికగా చేసుకొంటున్నాయి. తొలి దశలో అయిదు స్టార్టప్స్ పరిశోధనలు ప్రారంభించాయి. తాజాగా రెండో దశలో మరో 16 స్టార్టప్స్ ఆవిష్కరణలను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) వైజాగ్ అడిషనల్ డైరెక్టర్ సురేష్ 'సాక్షి'కి తెలిపారు. రెండు దశలతో కలిపి 21 స్టార్టప్‌లు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. గతంలో ఏర్పాటైన 5 స్టార్టప్‌లు, తాజా స్టార్టప్‌లలో 8 కంపెనీలు స్టీల్‌ప్లాంట్ (ఆర్‌ఐఎన్ఎల్) సమస్యలపై పరిశోధనలకు ఏర్పాటయ్యాయి. మిగతా 8 స్టార్టప్‌లు సాధారణ సమస్యలపై పరిశోధన చేస్తాయి. ఈ 8 సంస్థలు అందరికీ ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేలా వినూత్నమైన ఆలోచనలతో వచ్చాయని, అందుకే వాటిని ఎంపిక చేశామని సురేష్ చెప్పారు. తాజాగా వచ్చిన 16 స్టార్టప్స్ పరిశోధనల కోసం కల్పతరువులో ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు ల్యాబ్, ఆర్థిక సహకారం వంటి ప్రయోజనాలను కల్పిస్తారు.

మరిన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు విస్తరణ

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికే పరిమితమైన కల్పతరువును మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తాజాగా మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని సురేష్ చెప్పారు. త్వరలోనే షిప్‌యార్డ్ సమస్యలను నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేలా ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌టీపీసీ, విశాఖ పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

మిరప.. రెపరెప

రికార్డు స్థాయిలో సాగు

- ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 4.84 లక్షల ఎకరాలు
- 2022–23లో రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా
- ఫలించిన సస్యరక్షణ చర్యలు.. నల్ల తామర సహా చీడపీడలు దూరం
- గతేడాది కంటే మిన్నగా దిగుబడులు వస్తాయని అంచనా



సాక్షి, అమరావతి

ఈ రైతు పేరు కంబాల బ్రహ్మం. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఈయన గతేడాది 2 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది బోరు కింద 4 ఎకరాల్లో మిరపను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ అధికారుల అండదండలతో సాగు చేస్తున్నామని.. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఎక్కడా కనిపించలేదని బ్రహ్మం చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడితోపాటు గతేడాది కంటే మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఈ ఏడాది మిరప పంటను రైతులు రికార్డు స్థాయిలో సాగు చేస్తున్నారు. మంచి ధర పలుకుతుండటంతో ప్రతికూల వాతావరణంలోనూ భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడం.. గత ఏడాది కంటే మిన్నగా దిగుబడులొచ్చే అవకాశం ఉండటంతో రైతుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 4.87 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 6 లక్షల ఎకరాల్లో మిరప నాట్లు వేయగా.. నవంబర్ మొదటి వారం వరకు పంట వేసే అవకాశం ఉన్నందున అదనంగా కనీసం మరో 20–30 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ఒకింత కలవరపెట్టినప్పటికీ సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గతేడాది కురిసిన వర్షాలతో భూగర్భ జలాలకు లోటు లేకపోవడంతో బోర్ల కింద రికార్డు స్థాయిలో పంటలు వేశారు.

సమృద్ధిగా ఎరువులు.. ఫలిస్తున్న సస్యరక్షణ చర్యలు

సీజన్ ఆరంభం నుంచి ప్రభుత్వం అండగా నిలవడంతో ఏ దశలోనూ విత్తనం, ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడలేదు. ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచడంతో గ్రామంలోనే పొందగలుగుతున్నారు. మరోవైపు నల్ల తామరను ఎదుర్కొనేందుకు ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించడంతో రైతులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం పంట 85 శాతం ఏపుగా పెరిగే దశలో ఉండగా.. 15 శాతం పూత దశకు చేరుకుంది. ప్రభుత్వ చర్యల ఫలితంగా నల్లతామరతో సహా ఇతర చీడపీడలు, తెగుళ్ల జాడ కనిపించలేదు.



దిగుబడి.. ధరలపై ఆశలు

గతేడాది ఎకరాకు 18 నుంచి 23 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈసారి 20–25 క్వింటాళ్లకు తగ్గదని అధికారులు చెబుతున్నారు. గతేడాది 11.50 లక్షల టన్నుల దిగుబడులు రాగా.. ఈ ఏడాది 12 లక్షల టన్నులకు పైగా వస్తుందని అంచనా వేస్తున్నారు. 2022–23లో గరిష్టంగా క్వింటాల్ ధర రూ.27 వేలు పలకగా.. ప్రస్తుతం కనిష్టం రూ.20వేలు, గరిష్టంగా రూ.29 వేలు, మోడల్ రకం రూ.24 వేల వరకు పలుకుతోంది. తొలుత మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్ మిరపపై వర్షాభావ పరిస్థితులు ప్రభావం చూపడంతో మిరప ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. పంట కోతకొచ్చే సమయానికి రూ.30 వేల నుంచి రూ.32 వేలకు పైగా చేరవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిరపకు ఢోకా లేదు

మిరప గతేడాది కంటే మిన్నగా సాగవుతోంది. ఇప్పటికే 6 లక్షల ఎకరాలు దాటింది. సీజన్ ముగిసే నాటికి కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటే అవకాశాలు ఉన్నాయి. ఆర్బీకే స్థాయిలో చేపట్టిన సస్యరక్షణ చర్యల వల్ల నల్లతామర, చీడపీడల ప్రభావం కనిపించలేదు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పెరుగుతున్న ధరలు వల్ల రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.

– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

అలంకార అరటి.. ఆంధ్రా మేటి!

అర్నమెంటల్ బనానా సాగుకు అనువుగా గోదావరి జోన్

- ఉద్యాన వర్సిటీలో ఫలించిన పరిశోధనలు
- పుష్పగుచ్ఛాలు, గోడలపై అలంకరణల్లో వినియోగం
- వీటి ఆకులతో బయో ప్లేట్స్ తయారీ
- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం



సాక్షి, అమరావతి: విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన అలంకార అరటి (ఆర్నమెంటల్ బనానా) సాగుకు ఆంధ్రప్రదేశ్ అనువైనదిగా గుర్తించారు. ఈ రకం అరటిని సాగు చేసేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధకులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రపంచ ఉద్యాన పరిశ్రమలో అలంకార అరటి రకాలు ఇటీవల కాలంలో విశేష ప్రాచుర్యం పొందుతున్నాయి. అలంకార అరటి రకాలు ఆహ్లాదం గొలిపేలా ఉంటాయి. అందమైన ఆకులు, పువ్వుల కోసం వీటిని పెంచుకుంటారు. అయితే.. ఇవి తినదగిన పండ్లను ఉత్పత్తి చేయలేవు.

6 నెలలకు రూ.లక్ష ఆదాయం

బ్రెజిల్, థాయ్‌లాండ్, మయన్మార్, చైనా దేశాలలో ఈ రకాలు విశేష ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటికి ఆ దేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది. నాలుగు మూసా జాతులను సంకరపర్చడం ద్వారా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చాలా పొట్టిగా, చిన్నగా.. చూసేందుకు అందంగా కనిపిస్తాయి. ఇంటి పెరట్లోనూ, కుండీలలోను ఈ రకాలను పెంచుకోవచ్చు. ఈ మొక్కలను కనీసం ఒకటిన్నర మీటర్ దూరంలో నాటుకోవచ్చు. నేల స్వభావాన్ని, తోటలోని అనువును బట్టి ఇంకా దగ్గరగా కూడా నాటుకోవచ్చు. వీటికి సోకే ఆకుమచ్చ, గొంగళి పురుగుల నివారణ కోసం కనీస సంరక్షణ చర్యలు చేపడితే చాలు. కుండీ మొక్కలు, ఇంటి ముంగిట, పెరటి తోటల్లో అందం కోసం నాటుకోవడానికి పిలకల్ని ఉత్పత్తి చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి 6 నెలలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. వీటి ఆకులను పుష్పగుచ్ఛాల్లో విరివిగా ఉపయోగిస్తుంటారు. గోడలపై అలంకరణలకు, బయో ప్లేట్స్‌గా కూడా ఉపయోగిస్తున్నారు. విదేశాల్లో మాత్రమే సాగవుతున్న ఈ రకాల సాగుకు రాష్ట్రంలోని గోదావరి జోన్‌లోని ఉష్ణ మండల ప్రాంతం అనువైనదిగా గుర్తించారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించే దిశగా ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది.

సత్ఫలితాలిచ్చాయి



గోదావరి మండలంలో ప్రధాన పండ్ల అరటిలో ఆర్నమెంటల్ అరటి జాతుల సాగుపై చేసిన పరిశోధనలు సత్ఫలితాలిచ్చాయి. తేమతో కూడిన పరిస్థితులలో వీటి సాగుపై అధ్యయనం చేశాం. మన ప్రాంత వాతావరణానికి అనువుగా, వీటి సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ పరిశోధన ఎంతగానో దోహదపడుతుందని గుర్తించాం.

– డి.బేబి శ్రీదివ్య, ఎమ్మెస్సీ విద్యార్థిని, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

సత్ఫలితాలిస్తున్న పరిశోధనలు



పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయి. మన ప్రాంతం వీటి సాగుకు అనువైనదిగా గుర్తించాం. రైతులకు పరిశోధనా ఫలాలు అందించేందుకు పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి.

– డాక్టర్ ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

Published and Printed by V. Murali, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 264, Rajanagaram Village & Mandal, Rajamahendravaram (East Godavari) and Printed atJagati Publications Limited, Survey No. 264, Rajanagaram Village & Mandal, Rajamahendravaram (East Godavari), Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-883-2483010, RNI Regn No. APTEL/2008/23802.